ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలి

తహసీల్దార్లకు కలెక్టర్ సూచన



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తహసీల్దార్లు ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తహసీల్దార్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. అధికారులు, ప్రజలతో ఏ విదంగా ప్రవర్తిస్తున్నారనే అంశంపై ఐవీఆర్ఎస్ ద్వారా తీసుకున్న సిటిజన్ ఫీడ్ బ్యాక్‌పై చర్చించారు. సి.బెళగల్, గోనెగండ్ల, కోడుమూరు, నందవరం, వెల్దుర్తి, గూడూరు మండలాల తహసీల్దార్లకు సంబంధించి నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. అధికారులు, ప్రజలతో ఓపికతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేసి వారి నుంచి సానుకూల స్పందన పొందాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 12, పత్తికొండ ఆర్డీవో వద్ద 7, కర్నూలు ఆర్డీవో వద్ద 6, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడీ వద్ద 2, కార్మిక శాఖ, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, స్కిల్ డెవలప్‌మెంట్, కర్నూలు మున్సిపల్ కమిషనర్, డీఆర్‌డీవో పీడీ హౌసింగ్ పీడీల వద్ద ఒక్కో దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని గడువులోపు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినులకు జర్మన్ భాషపై శిక్షణ

కర్నూలు కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండీ అండ్ సీఈఓ ఆదేశాల మేరకు బీఎస్సీ (నర్సింగ్) పూర్తి చేసిన మహిళా విద్యార్థినులకు జర్మన్ భాషలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమం, సాధికారత అధికారి కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు వయో పరిమితి 35 ఏళ్లు లోపు ఉండాలని, బీఎస్సీ (నర్సింగ్)తో పాటూ క్లినికల్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. అభ్యర్థులు రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం 10 నెలలు ఉంటుందన్నారు. ఎంపికైన వారికి తిరుపతి, విశాఖపట్నం, గుంటూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాల్లో వసతి ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఖర్చులు, భోజన వసతికి సంబంధించి స్టైఫండ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు డి.మనోహర్, ఈడీ, అంతర్జాతీయ నైపుణ్య కార్యక్రమం, ఏపీ విజయవాడ సెల్ నంబర్: 85000 69569, ఆంజనేయులు నాయక్, జూనియర్ అసిస్టెంట్, సెల్ నెంబర్: 99891 20904ను సంప్రదించాలని సూచించారు.

పన్ను ఎగవేతదారులు



- అధికారుల అక్రమ వసూళ్లు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- యథేచ్ఛగా సరుకుల అక్రమ రవాణా

కర్నూలు న్యూసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పన్ను ఎగవేతదారులు ఎక్కువయ్యారు. వాణిజ్య పన్నుల శాఖలోని లొసుగులను గుర్తించి వ్యాపారులు అక్రమంగా వివిధ రకాల సరుకులను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఎగవేతదారులతో వాణిజ్యపన్నుల శాఖ అధికారులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. జిల్లాకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదు, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ తదితర ప్రాంతాల నుంచి నిత్యం పెద్ద ఎత్తున సరుకు రవాణా అవుతోంది. ఇదేక్రమంలో వ్యాపారులు ఇష్టానుసారంగా అధికారులను అడ్డం పెట్టుకుని పన్ను ఎగ్గొడుతున్నారు. ఇందులో చాలా సరుకులు రవాణా చేసే వాహనాలు ఈ-వేబిల్, ఇన్‌వాయిస్ లేకుండా రూ.కోట్లు విలువ చేసే సరుకును వివిధ రాష్ట్రాల నుంచి ఉమ్మడి జిల్లాలోకి తీసుకువస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని కర్నూలు జిల్లా కేంద్రం, నంద్యాల జిల్లా కేంద్రంలోకి ఎక్కువ శాతం అక్రమంగా సరుకు రవాణా అవుతున్నట్లు సమాచారం. ఎలాంటి బిల్లులు చూపించకుండా జీరో దందా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రతి సంవత్సరం రూ.150 కోట్లకు పైగా పన్ను ఎగ్గొడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు అధికారులు లక్షలకు ఆశ పడి కోట్ల జీఎస్టీని ప్రభుత్వ ఖజానాకు రాకుండ అడ్డుకుంటున్నారు. అధికారులు ఖచ్చితంగా తనిఖీలు చేపడితే ఉమ్మడి జిల్లాలో సంవత్సరానికి రూ.250 కోట్లకు పైగా పన్నులు వసూలయ్యే అవకాశాలు ఉన్నాయి.

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం



వసూళ్లపై ఉన్నతాధికారుల ఆరా

గతంలో వాహనాల తనిఖీలు నేరుగా చేపట్టేవారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ జీఎస్టీ అధికారులకు తమ తమ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేలా జిల్లా అధికారులు విధులు కేటాయిస్తున్నారు. ఈ మేరకు జీఎస్టీ అధికారులు వాహనాలను తనిఖీలు ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు నిర్వహిస్తారు. ఈ క్రమంలో రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల పరిధిలోనే ఎక్కువగా దొంగ సరుకు రవాణా అవుతోంది. వ్యాపారుల తరహాలోనే అధికారులు రాత్రి నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున వరకు వాహనాలను తనిఖీ చేస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీఎస్టీ పన్ను వసూళ్ల పేరుతో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. వాహనదారులనుంచి భారీ ఎత్తున ముడుపులు వసూలు చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఈ మేరకు అక్రమార్జనకు పాల్పడుతున్న అధికారుల వివరాలపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఒకే బిల్లుతో అక్రమ రవాణా

ఒక్క ఈ-వేబిల్లు ఒక్కరోజు గడువు సమయంలో 200 కిలోమీటర్ల పరిధి వరకు ఉంటుంది. అయితే మరో వే బిల్లు రెండు రోజుల వరకు గడువు ఉంటుంది. అంటే 400 కిలోమీటర్లకు వరకు ఉంటుంది. ఈ మేరకు కొంతమంది వ్యాపారులు సిమెంట్, స్టీల్, ఐరన్ ఓర్‌తో పాటు వివిధ ఉత్పత్తి వస్తువులను ఎక్కువగా ఆయా పరిశ్రమల నుంచి రవాణా చేస్తుంటారు. కొన్ని పరిశ్రమలు సరుకు రవాణా ఉత్పత్తి తక్కువగా చూపిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతుంటాయి. టోల్‌గేట్ లేని ప్రాంతాల్లో ఇలాంటి దోపిడీ మరీ ఎక్కువగా ఉంటుంది. ఒకే వే బిల్లుతో పదిరోజులు సరుకు రవాణా చేస్తుంటారు. ఈ వే బిల్లులో ఈ రోజు సరుకు రవాణా చేస్తే ఆ రోజు తేదీ తప్పకుండా ఉంటుంది. అయితే కొందరు వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై తనిఖీ సమయంలో వే బిల్లును అధికారుల వద్ద సీల్ వేయించుకోకుండా లంచాలు సమర్పించుకుని వెళ్తుంటారు. సరుకు రవాణా క్షేమంగా గమ్యస్థానానికి చేరిన తరువాత ఈ వేబిల్లులో సరుకు విలువ తక్కువ వేసి ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తుంటారు. ఈ క్రమంలో సిమెంట్ లారీ లోడు కనీసం రూ.84వేలు ఉంటుంది. 18 శాతం జీఎస్టీ రూ.15,120 కలుపుకుని రూ.99,120 అవుతుంది. అయితే కొందరు వే బిల్లును అధికారులకు చూపించకుండా బిల్లులో సిమెంటు స్థానంలో ఏదో ఒకరకమైన వేస్టేజీని రవాణా చేసినట్లు అందులో సరుకు విలువ రూ.10 వేలు చూపిస్తారు. ఇలా ఒక్క సిమెంట్ లారీ లోడ్ నుంచి రూ.14వేలు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. జిల్లా మీదుగా ప్రతిరోజు వందల టన్నుల సిమెంటు రవాణా అవుతోంది.



మిగతా 6వ పేజీలో

వంద శాతం హాజరు నమోదు ఉండాల్సిందే: డీఈవో



ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చిస్తున్న డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, విద్యార్థులు వంద శాతం హాజరు నమోదు ఉండాల్సిందేనని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ స్పష్టం చేశారు. సోమవారం తన కార్యాలయంలో డీఈవో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉపాధ్యాయులు ఫేషియల్ యాప్ అటెండెన్స్‌లో పూర్తి చేయాల్సిందేనన్నారు. సకాలంలో హాజరు నమోదు చేయకపోతే గైర్హాజర్ పడుతుందని వివరించారు. రాష్ట్రంలోని కర్నూలు జిల్లా ఫేషియల్ యాప్ హాజరులో చివరి నుంచి రెండో స్థానంలో ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హాజరు నమోదులో మినహాయింపు లేదని వివరించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన హాజరును 9:10 గంటల వరకు విద్యార్థుల హాజరును 9:30 గంటల నుంచి 10 గంటల వరకు సమయాన్ని పెంచాలని సూచించారు. కొన్ని పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటు అధికంగా ఉండటం వల్ల హాజరు ఆలస్యమవుతోందన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, జనార్దన్, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవీ వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, ఏపీటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు రంగన్న, నాగరాజు, పీఆర్‌టీయూ నాయకులు ఎన్‌వీ కృష్ణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రవికుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై గగ్గోలు ఎందుకు?

వైసీపీపై 'కుడా' చైర్మన్ సోమిశెట్టి ధ్వజం



కర్నూలు అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ అందిరికీ తెలిసిందేనని, ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టుపై వైసీపీ ఎందుకు గగ్గోలు పెడుతోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం ముడుపులు మాజీ సీఎం జగన్‌కు వెళ్లినట్లు సిట్ వెల్లడించిదని, ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. పేర్ని నాని, అంబటి రాంబాబు, రోజా నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. ఆనాడు ఏ తప్పూ చేయని చంద్రబాబును జైలులో పెట్టారని, అయితే నేడు మిథున్‌రెడ్డి తీరుపై స్పందించిన తీరును ప్రజలు అసహించుకుంటున్నారని అన్నారు. అధికారంలో ఉండగా అడ్డదిడ్డంగా దోచేసిన తీరు ప్రజలకు తెలుసునని అన్నానరు. వైసీపీ పాలనలో తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారని, అయితే ఈ ప్రభుత్వంలో ఎలాంటి కక్షసాధింపులు ఉండవని అన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, విరూపాక్షి, సర్పంచులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి, పలువురు సర్పంచులు కోరారు. కర్నూలులోని కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిధులు లేక మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని తెలిపారు. గ్రామాల్లో కనీసం డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి సమస్యను తీర్చలేకపోతున్నామని అన్నారు.



రక్తపరీక్షల కోసం క్యూలైన్లలో రోగులు

జీజీహెచ్ కిటకిట

- ప్రబలుతున్న జ్వరాలు
- ఆసుపత్రికి క్యూ కట్టిన జనాలు
- పరీక్షల కోసం బారులు

కర్నూలు హాస్పిటల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వాతావరణంలో మార్పులు, దోమల దండయాత్రలతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీలు కిటకిటలాడాయి. సోమవారం సాయంత్రం ఉదయం సాధారణ ఓపీ రోగులు 2630 మంది చికిత్స కోసం రాగా, ఇందులో 240 మంది అడ్మిషన్ పొందారు. ఇక మెడికల్ ఓపీకి 300 మంది రోగులు రాగా, వీరిలో జ్వరపీడితులే అధికంగా వచ్చారు. దీంతో వైద్యులు రోగులను చూసి పరీక్షలను రాసి ఇవ్వడంతో న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో రోగులతో రద్దీ పెరిగింది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ టోకెన్లు అయి పోవడంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి రోగులు టోకెన్ల కోసం బారులు దీరారు. తీరా మధ్యాహ్నం 2 గంటల వరకు టోకెన్ల కోసం రోగులు పడిగాపులు కాశారు.



స్కానింగ్ టోకెన్ల కోసం వేచి చూస్తున్న రోగులు

నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు వచ్చేశాయ్

- జిల్లాకు భారీగా స్టాంపులు
- వివిధ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు కేటాయింపు

కల్లూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ప్రజాప్రయోజనాల దృష్ట్యా నాసిక్ నుంచి నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను తెప్పించారు. కర్నూలు జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్రయ, విక్రయదారుల అవసరాలకు అనుగుణంగా జిల్లా రిజిస్ట్రార్ కేటాయింపులు జరిపారు. నెలల తరబడి నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు లభించకపోవడంతో ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టింది. జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు రూ.16లక్షల విలువ చేసే రూ.50, రూ.32లక్షల విలువ చేసే రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపులు జిల్లాకు వచ్చాయి. వీటితోపాటు రూ.2,22,8000 విలువైన ప్రత్యేక రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100 స్టాంపుబిల్లులు, కోర్టు రుసుము స్టాంపు బిల్లులు, నోటరీ స్టాంపుబిల్లులు పంపారు. వివిధ స్టాంపులు మొత్తం రూ.2,50,28,000 విలువ చేసే స్టాంపులు జిల్లాకు వచ్చాయి. నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను ఆన్‌లైన్ చేసిన అనంతరం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. రూ.50 స్టాంపులను కర్నూలు-5000, కల్లూరు-4000, ఆదోని-4000, ఎమ్మిగనూరు-4000 అలాగే రూ.100 నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను కర్నూలు-5000, కల్లూరు-5000, ఆదోని-4000, ఎమ్మిగ నూరు-4000 పంపినట్లు అధికారులు తెలిపారు.



● **ఈ-స్టాంపింగ్ విధానంపై ప్రజల విముఖత:** గత వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశపెట్టిన ఈ-స్టాంపింగ్ విధానంపై ప్రజలు విముఖ్యత చూపిస్తున్నారు. ఈ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కక్షిదారులు ఆసక్తి చూపకపోవడం, నాన్‌జ్యుడీషియల్ స్టాంపులపై మొగ్గు చూపడంతో కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● **బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా చర్యలు:** జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో దాదాపు 150-175 వరకు స్టాంప్ వెండర్లు ఉన్నారు. గతంలో స్టాంప్ వెండర్లకు రిజిస్టర్‌లో నమోదు చేసి నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పి ఆన్‌లైన్ విధానానికి నాంది పలికింది. దీంతో పారదర్శకత పెరిగి అవినీతికి తావులేకుండా క్రయ, విక్రయదారులకు సేవలందించేలా చర్యలు తీసుకుంది.

నంద్యాల కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్లు!

7లో
- బైక్‌ల రికవరీతో కదిలిన డొంక
- నలుగురు నిందితుల అరెస్టు

బాధితులకు న్యాయం చేస్తాం


అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా

కర్నూలు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. సోమవారం కర్నూలులోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 87 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో సీఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని: కర్నూలు కలెక్టరేట్ ఆఫీసులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన ఫారూక్ రూ.2.26 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు అరుంధతీ నగర్‌కు చెందిన ఉమాబాయి ఫిర్యాదు చేశారు. ఓ ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పుస్తకాలకు రూ.7,800 తీసుకుని కాలం చెల్లిన ప్రభుత్వ పుస్తకాలు అమ్మి మోసం చేస్తున్నారని కర్నూలు దిన్నెదేవరపాడు గ్రామం అంబేడ్కర్ నగర్‌కు చెందిన రవితేజ ఫిర్యాదు చేశారు. బజాజ్ ఫైనాన్స్‌లో సబ్సిడీ కింద రుణం, అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి జోహరాపురం గ్రామం వద్ద నట్టు ప్రాంతానికి చెందిన విజయకుమార్ రూ.65వేలు తీసుకుని మోసం చేశారని కర్నూలు కొత్తపేటకు చెందిన నాగన్న ఫిర్యాదు చేశారు. కుమారుడు ఆస్తి కోసం తన భార్య కాలు విరగొట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు గుడిపాడు గ్రామానికి చెందిన నడిపి మిన్నల్లా ఫిర్యాదు చేశారు. షఫీ యుల్లా అనే వ్యక్తి మూడు లారీల టైర్లు, టార్పాలిన్లు, టూల్ బాక్సులు, బ్యాటరీలు తీసుకెళ్లాడని కర్నూలుకు చెందిన ముల్ల ఆంజాద్ ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చెందిన నాని రూ.6లక్షలు విలువ గల ఉల్లిగడ్డలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కోడుమూరు మండలం బైనదొడ్డి గ్రామానికి చెందిన చిన్న వీరన్న ఫిర్యాదు చేశారు. మాధవరం గ్రామంలో ఉన్న తన మూడు సెంట్ల స్థలాన్ని అక్రమంగా అమ్మి నన్ను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రాలయం కల్లుదేవకుంట గ్రామానికి చెందిన మాధవరెడ్డి ఫిర్యాదు చేశారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా 49 సెంట్ల పెద్దల ఆస్తిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడమే కాకుండా దాడులు చేయిస్తున్న జక్కుల కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని సి.బెళగల్ మండలం యనగండ్ల గ్రామానికి చెందిన శ్రీదేవి, బతుకమ్మ ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా



మెదడును కాపాడుకుందాం

శరీరంలో గుండె తర్వాత అత్యంత ముఖ్యమైన అవయవం మెదడు. ఏ భాగం పని చేయాలన్నా మెదడే కీలకం. మెదడు కనుక మొరాయిస్తే ఇక మనిషి ఏం చేయలేని పరిస్థితి. అందుకే మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మెదడు ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. కొందరు దీర్ఘకాలికంగా ఉన్న అధిక రక్తపోటు కారణంగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కూడా మెదడుకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న కేసులు పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మెదడుపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 22న అంతర్జాతీయ మెదడు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అన్ని వయస్సుల గల వారికి మెదడు ఆరోగ్యం దారి అన్న నినాదాన్ని ఇచ్చింది. అంటే మెదడు అనేది అన్ని వయస్సుల వారికి ఎంతో అసవరమో అన్నది ఈ థీమ్ తెలియజేస్తుంది.

- కర్నూలు హాస్పిటల్ (ఆంధ్రజ్యోతి)



బ్రెయిన్ స్ట్రోక్

ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా మెదడు ఆక్సిజన్ పోషకాలను తీసుకెళ్లే రక్తనాళాలకు అవరోధం కలగడం, లేదా చిట్లడం వల్ల మెదడులోని కొంత భాగం మరణానికి దారి తీసి స్ట్రోక్‌కు గురవుతున్నారు. రక్తనాళంలో అడ్డంకుల కారణంగా ఇస్కిమిన్ స్ట్రోక్ వస్తుంది. పక్షవాతానికి గురయ్యే వారిలో 80 శాతం ఈ రకమైన పక్షవాతానికి గురవుతారు. అదేవిధంగా రక్తనాళం చిట్లడం వల్ల హెమరేజిక్ స్ట్రోక్ సంభవిస్తుంది. ఒక వైపు చేయి, కాలు పని చేయకపోవడం, ఫలితంగా నడవడానికి ఇబ్బంది పడటం, అకస్మాత్తుగా తల తిరగడం, శరీరం బ్యాలెన్స్ కోల్పోవడం, మూతి ఒక వైపునకు వంకరగా పోవడం దీని లక్షణాలు. స్ట్రోక్ అనేది అత్యవసర పరిస్థితి కనుక.. స్ట్రోక్ రోగ నిర్ధారణ వేగంగా జరగాలి. ఎలాంటి రకమైన స్ట్రోక్ వచ్చిందో తెలుసుకోవడం తప్పనిసరి. దీని కోసం సిటీ స్కాన్, ఎంఆర్ఐ బ్రెయిన్ వంటి పరీక్షలు అవసరం అవుతాయి.

- పెరుగుతున్న బ్రెయిన్ కేసులు
- నేడు అంతర్జాతీయ మెదడు దినోత్సవం

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- నిద్ర లేచే సమయంలో తలనొప్పి, చూపు మందగింపు, శరీరం ఒక వైపు కుంగినట్లు అనిపించడం ఉంటే వైద్యులను సంప్రదించాలి.
- వారానికి కనీసం ఐదు రోజులు వ్యాయామం గానీ, జాగింగ్ గానీ, నడక, సైక్లింగ్ రోజు 30 నిమిషాలకు తక్కువ కాకుండా చేయాలి.
- రోజుకు 7 - 8 గంటలు గాఢ నిద్ర తప్పనిసరి.
- చేపలు, బ్లూబెరిస్, గుమ్మడికాయ, నారింజ, వాల్‌నట్స్, బ్రోకలి, గుడ్లు, విటమిన్-బీ-12 గల ఆహారాలను తీసుకోవాలి.

చికిత్స విధానాలు

చికిత్స యొక్క విధానం స్ట్రోక్ రకంపై ఆధారపడి ఉంటుంది. రక్తనాళంలో అడ్డంకుల వల్ల వచ్చే స్ట్రోక్‌లో (ఇస్కిమిన్ స్ట్రోక్) థ్రాంబోలైటిక్ థెరపి, మెకానికల్ థ్రాంబెక్టమీ వంటివి ఉంటాయి. ఇలాంటి చికిత్స వల్ల తొందరగా సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉంటుంది. థ్రాంబోలైటిక్ థెరపీలో అల్టెప్లేజ్ లేదా టీనక్టెప్లేజ్ అనే ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల రక్తప్రవాహాన్ని పునరుద్ధరించవచ్చును. ఈ ఇంజెక్షన్ లక్షణాలు కనిపించిన 4-5 గంటల్లో ఇవ్వాలి. మెకానికల్ థ్రాంబెక్టమిలో థ్రాంబోలైసిస్ ఇంజక్షన్ తొలగించలేని పెద్దగడ్డలను తొలగించవచ్చును. కరోటిడ్ ఎండార్టెక్టమి అనే ట్రీట్‌మెంట్‌తో స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చును. రక్తం పలుచగా చేసే మందులు తీసుకోవాలి.



అందుబాటులో అత్యాధునిక వైద్యం



మెదడులోని బ్రెయిన్ స్ట్రోక్ తలనొప్పి, మూర్ఛ, పార్కిన్సన్ వ్యాధులు మతిమరుపు జబ్బులకు ఇటీవల కాలంలో అత్యాధునిక చికిత్సలకు అందుబాటులోకి వచ్చాయి. స్ట్రోక్ వచ్చిన రోగికి నాలుగున్నర గంటలలోపు థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇస్తే రోగి కోలుకుంటారు. ఇక 24 గంటలలోపు మెకానికల్ థ్రాంబెక్టమి ఇంజెక్షన్ వేస్తే రోగి కోలుకునే అవకాశం ఉంది.

- చల్లపల్లె బాబురావు, న్యూరాలజిస్టు, కిమ్స్, కర్నూలు

కర్నూలు జీజీహెచ్‌కు బ్రెయిన్ కేసులు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరోసర్జరీ విభాగం రాయలసీమ జిల్లాలోనే ఎంతో పేరొందింది. న్యూరోసర్జన్ (ఓపీ.నెం.5) ప్రతి బుధ, శనివారాల్లో ఓపీ ఉంటుంది. ప్రతి ఓపీకి 300 మంది వస్తుండగా.. వీరిలో 150 మంది బ్రెయిన్, తలనొప్పితో బాధపడుతూ వస్తుంటారు. ఇక బ్రెయిన్ ట్యూమర్ కేసులు 10 మంది అడ్మిషన్ పొందుతుంటారు. న్యూరోసర్జరీ విభాంలో 60 పడకలు ఉండగా.. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ రాంబాలాజీ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ సురేంద్ర వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పుండరీకాక్షయ్య, వరుణ్ కుమార్ రెడ్డి, అచ్యుత్‌తో పాటు ఐదుగురు పీజీలు పని చేస్తున్నారు.

తలనొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు



మెదడుకు సంబంధించిన వ్యాధులు అన్ని ప్రమాదకరం. తలనొప్పి ఉన్న ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. అధిక రక్తపోటు మెదడులో చిట్లిపోవడం, ఫిట్స్ కేసులు కూడా న్యూరోసర్జరీ విభాగానికి వస్తుంటాయి. మెదడుకు సంబంధించిన వ్యాధులను సిటీ స్కాన్, ఎంఆర్ఐ, బ్రెయిన్ పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చు. కొన్ని వ్యాధులకు మందులతో నయం కాగా, మరి కొన్ని కేసులకు ఆపరేషన్ అవసరమవుతుంది. మెదడుకు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పక్షవాతం కేసుల కోసం ప్రభుత్వం ఉచితంగా థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచింది.

- డాక్టర్ రాంబాలాజీ నాయక్, ఇన్‌చార్జి హెచ్‌వోడీ, న్యూరోసర్జరీ విభాగం, కర్నూలు జీజీహెచ్

జన్యులోపాలు కారణం



పక్షవాతానికి గురయ్యేవారిలో చాలా మందికి సరైన ఆహార అలవాట్లు లేకపోవడం ఒక కారణం. జన్యుపరమైన కారణాలతో కొందరు చిన్న వయస్సులోనే బాధితులవుతున్నారు. మన దేశంలో 10 శాతానికి పైగా మరణాలకు బ్రెయిన్ స్ట్రోక్ కారణమవుతున్నారు. పక్షవాతానికి గురై చికిత్స పొంది ఆరోగ్యం మెరుగుపడ్డ వారిలో 30 శాతం మంది వరకు తిరిగి బాధితులవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- డాక్టర్ నాగసురేష్, న్యూరాలజిస్టు, మెడికవర్, కర్నూలు

మార్గదర్శకుల వివరాలు ప్రతి అధికారి వద్ద ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీ4 పథకానికి సంబంధించి మార్గదర్శకుల వివరాలు ప్రతి మండల స్థాయి అధికారి వద్ద ఉండాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ఏ శాఖకు సంబంధించి అయినా అక్రమ నిర్మాణాలు ఉంటే తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు బంగారు కుటుంబాల ఇంటికి వెళ్లి పీ4 యాప్‌లు వారి వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లాలో 43,041 బంగారు కుటుంబాలు నమోదయ్యాయని తెలిపారు. మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మట్టితో నిర్మించిన గృహాల యజమానులకు వీఆర్వోల ద్వారా నోటీసు అందజేయాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. రాత్రిపూల మట్టిగృహాల్లో నిద్రపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా చెరువు కట్టలు బలహీనంగా ఉంటే వాటిని సరిచేసేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. తల్లికి వందనం నగదు అనేక మంది లబ్ధిదారులకు జమ కాలేదని ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై సంబంధిత పత్రాలను స్థానిక సచివాలయాల్లో అందజేసేలా ఆయాశాఖల అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 26 మండ లాలకు 26 బ్యాంకులు లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయడానికి ముందుకు వచ్చాయని తెలిపారు. సమావేశంలో డీఆర్వో రామునాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు దుర్వేశి గ్రామానికి మంత్రి ఆనం రాక



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం గడివేముల మండలం దుర్వేశి గ్రామంలో పర్యటించనున్నారు. గ్రామంలో జరిగే 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఉదయం 11:30 గంటలకు దుర్వేశి గ్రామానికి ఎమ్మెల్యే గౌరుచరితతో పాటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని మండల టీడీపీ నాయకులు తెలిపారు.

విజయవాడ- కర్నూలు సర్వీసులు పెంచాలి

కేంద్రమంత్రిని కోరిన ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ విజయవాడకు విమాన సర్వీసులు నడపాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడకు వెళ్లే ప్రయాణికులకు అనుకూల సమయంలో మార్పులు చేయాలని కోరారు. గతంలో కేంద్ర మంత్రి హామీ మేరకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని కోరగా త్వరలోనే అధికారికంగా విమానయాన శాఖ ప్రకటన చేస్తుందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు చెన్నైకు విమాన సర్వీసును కొనసాగించాలని మంత్రిని కోరినట్లు ఎంపీ బైరెడ్డి తెలిపారు.



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

జాతీయ జెండాకు 78 వసంతాలు

నేడు జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం

ఆత్మకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మన దేశ కీర్తిప్రతిష్ఠలను చాటుతూ.. ప్రతి ఏటా జనవరి 26న జరిగే గణతంత్ర్య దినోత్సవ, ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఎగిరే త్రివర్ణ పతాకానికి 78 వసంతాలు పూర్తి అయ్యాయి. ప్రతి దేశానికి తమకంటూ ఓ ప్రత్యేమైన జాతీయ పతాకాన్ని రూపొందించుకునేలా ఆనవాయితీ నడుస్తోంది. అందులో భాగంగానే మనదేశానికి కూడా ఓ జాతీయ పతాకం నిర్మించుకోవాలన్న తలంపు ఒక ఆంధ్రుడితో సాధ్యపడింది. జాతీయ పతాకంలో మూడు రంగులను మిళితం చేసి భిన్నత్వంలో ఏకతత్వాన్ని ప్రతిబింబిస్తూ.. సర్వమతాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ.. సత్యం, ధర్మం, న్యాయం నియమాలు ఉట్టిపడేలా 24 ఆకుల నీలిఆకాశ రంగు గల ప్రగతి చక్రంతో తీర్చిదిద్దబడింది మన మువ్వెన్నల జెండా. దేశ రాజధానీ ఢిల్లీలోని ఎర్రకోట నుంచి కుగ్రామంలోని ప్రాథమిక పాఠశాల వరకు జాతీయ జెండా ఎగిరేందుకు కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి మన ఆంధ్రుడే కావడం మనమంతా గర్వపడాలి. కృష్ణాజిల్లా మచిలీపట్నం మొవ్వ మండలంలోని భటపెనుమర్రు గ్రామానికి చెందిన హనుమంతరాయుడు, వెంకటరత్నమ్మల దంపతుల కుమారుడు పింగళి వెంకయ్య కొన్ని రంగులతో కూడిన ఓ జెండాను రూపొందించారు. ఆ జెండాను మొట్టమొదటి సారిగా 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగురవేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన లాలాహన్స్‌రాజ్ మన జాతీయ పతాకంపై రాట్న చిహ్నం ఉంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నం(చరాఖా)గల ఒక జెండాను చిత్రీకరించమని కోరారు. మహాత్ముడి సూచన మేరకు ఒక జెండాను ఆయన రూపొందించారు. పింగళి వెంకయ్య చేతుల మీదుగా రూపొందించిన జెండా జాతీయ పతాకంగా రాజ్యాంగ ముద్రను వేసేందుకు 1947 జూలై 22వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి తీర్మానం చేశారు. అయితే ఇందులో మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తొలగించి దాని స్థానంలో ఆశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడాల్చలని ప్రతిపాదించగా రాజ్యాంగం ఇందుకు ఆమోదించింది. కాగా చిహ్నం మార్పు తప్పితే.. పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకే రాజ్యాంగం ఆమోదముద్ర వేసింది. కాగా అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి నిదర్శనం. దీంతో ఈ నెల 22వ తేదీ నాటికి మన జాతీయ జెండా 78 వసంతాలను పూర్తి చేసుకుంది.





పన్ను ఎగవేతదారులు



(5వ పేజీ తరువాయి)

ముఖ్యంగా వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి 5,12,18,28 శాతం జీఎస్టీ స్లాబ్‌లను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో అధికంగా పన్ను వసూలు అయ్యేది 18,28 శాతం స్లాబ్ నుంచే...అయితే ఎక్కువగా ఈ స్లాబ్‌ల ద్వారానే పన్ను ఎగ్గొడుతున్నారు. సిమెంటు, ఐరన్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్లు, బ్యాటరీలు, ఏసీల, ఫ్రిజ్‌లు, సిగరెట్లు వీటి పరిధిలో ఉంటాయి. ఎక్కువ మొత్తంలో జీఎస్టీ చెల్లించాల్సి ఉండటంతో వ్యాపారులు సరుకు రవాణా దారులు అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతుంటారు. రూ.70 లక్షల సరుకు రవాణా చేస్తే కేవలం రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు సరుకుకు సంబంధించి పన్ను చెల్లిస్తారు.

అందినకాడికి దోచుకో!

జిల్లాకు వచ్చే సరుకులకు ఇన్వాయిస్, ఈ-వేబిల్ ఉంటుంది. రూ.40 లక్షలు విలువ చేసే సరుకులో రూ.15 లక్షలకు సంబంధించిన బిల్లులే ఉంటాయి. హైదరాబాద్ నుంచి కర్నూలుకు సరుకు రవాణా చేసే వాహనాలు మిర్యాలగూడ, నల్గొండ, జోగులాంబ గద్వాల తదితర ప్రాంతాలకు వెళ్తుంటాయి. అక్కడి నుంచి మరో సరుకును తీసుకుని వస్తాయి. ఆ సమయంలో టోల్ గేట్లు లేకుండా సరుకు రవాణా చేస్తున్న వాహనాల వివరాలు వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు చేరుతుంది. అధికారులు వెంటనే ఆ వాహనాలు ఎక్కడున్నాయో గుర్తిస్తారు. వీటిని పరిశీలించి ఆ వాహనంలో రూ.30 లక్షల విలువైన సరుకుకు జీఎస్టీ వసూలు చేయాలి. కానీ పన్ను వసూలు చేయకుండా వాహనదారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని పంపుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా అటు అధికారికి.. ఇటు వ్యాపారికి లబ్ధిచేకూరడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.

అలాంటి వాహనాలను సీజ్ చేస్తాము



జీఎస్టీ చెల్లించకుండా అక్రమంగా వస్తువులను రవాణా చేసే వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తాము. గతంలో నేరుగా తనిఖీలు చేపట్టేవాళ్లం. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తనిఖీలు నిర్వహించాలి. రెగ్యులర్ జీఎస్టీ అధికారులకు తమ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేలా విధులు వేస్తున్నాం. అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలు పెనాల్టీ చెల్లించని పక్షంలో వస్తువులను స్వాధీనం చేసుకుని పంపుతాం. అనంతరం స్వాధీనం చేసుకున్న వస్తువులను వేలం వేస్తాం.

-జె.నీరజ, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్

గడువులోపు సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): నిర్దిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పోలీసు అధికారులకు సూచించారు. నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 103 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముళ్ల ఆస్తి తగాదాలు తదితర ఫిర్యాదుల అందినట్లు తెలిపారు. చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం

- రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో ఆలయ జీర్ణోద్ధరణ
- రూ.7 కోట్లతో పనులు
- 27 నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు



జీర్ణోద్ధరణ అనంతరం నూతన శోభ సంతరించుకున్న ఆలయం

కొలిమిగుండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలతో స్వయంగా ప్రతిష్ఠించిన మహిమాన్విత లక్ష్మీనరసింహస్వామి ఆలయం తిరిగి నూతన శోభను సంతరించుకుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల తర్వాత అంతే ప్రాధాన్యత కలిగింది కొలిమిగుండ్ల లక్ష్మీ నృసింహ కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం. అయితే కాలక్రమేణా వేలాది ఎకరాల ఆలయ మాన్యం భూములు కరిగి, వందల్లోకి రావడం, ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయం ప్రాశస్త్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో నాలుగేళ్ల క్రితం గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆలయ జీర్ణోద్ధరణకు ముందుకొచ్చింది. పరిశ్రమ యజమాన్యం స్వామిపై భక్తితో ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ జీర్ణోద్ధరణ చేపట్టి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రూ.7కోట్ల నిధులతో ఈ పనులు చేపట్టడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ గర్భగుడి ప్రాధాన్యత దెబ్బతినకుండా అధునాతన టెక్నాలజీతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. ఆలయ గోడలపై పురాతన శిల్పకళా సంపదకు నూతన మెరుగులు దిద్దడంతో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకుంది. గతంలో మూడంతస్తులున్న రాజగోపురాన్ని నూతన హంగులతో 5అంతస్తులుగా నిర్మించారు. స్వామి వారి మెట్ల మార్గాన్ని ఒకవైపునకు చేర్చి, ఆలయ ప్రాంగణం మరింత విస్తరించారు. నూతన రంగులు, విద్యుత్ లైట్లతో ఆలయం సర్వం సిద్ధమైంది. దశాబ్దల అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పూర్వ వైభవం రావడంపట్ల గ్రామస్థులు, వివిధ ప్రాంతాల భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

27 నుంచి ఉత్సవాలు

రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో దేవదాయశాఖ పర్యవేక్షణలో ఈనెల 27 నుంచి ఆలయ ప్రారంభోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, హోమాలు, సంప్రదాయ పూజలు నిర్వహించనున్నారు.

భయం గుప్పిట్లో కొల్లంపల్లి తండా..!



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసున్న కొప్పంపల్లి తండా రైతులు

- బ్లాస్టింగు శబ్దాలతో దద్దరిల్లుతున్న గ్రామం
- ఇళ్లకు పగుళ్లు, ధ్వంసమవుతున్న రోడ్లు
- చెరువు ఫోర్‌షోర్ ఏరియాను అక్రమించి రహదారి నిర్మాణం
- క్వారీల నుంచి రక్షణ కల్పించాలని రైతుల ఆవేదన

కర్నూలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వెయ్యిలోపు జనాభా ఉన్న కొల్లంపల్లి తండాకు ఇప్పుడు క్వారీ కష్టమొచ్చింది. అర కిలోమీటరు దూరంలో క్వారీ, క్రషర్లు ఏర్పాటు చేయడంతో గ్రామం మొత్తం నిత్యం దద్దరిల్లిపోతోంది. క్వారీలో బ్లాస్టింగ్ చేపడుతుంటంతో ఆ శబ్దాలకు ఊరు మొత్తం బెంబేలెత్తిపోతోంది. వచ్చిపోయే టిప్పర్ల వేగానికి రహదారులు ధ్వంసమవుతున్నాయి. గ్రామానికే పెను కుంపటిగా మారిన క్వారీల నుంచి రక్షణ కల్పించాలని, చెరువుకు హంద్రీనీవా ద్వారా నీళ్లు విడుదల చేయాలని కోరుతూ ఆ పల్లె రైతులు అధికారులను వేడుకుంటున్నారు. తాజాగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టరు పి.రంజిత్ బాషాకు ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు.

కల్లూరు మండలం ఉల్లిందకొండ పంచాయతీ మజరా గ్రామం కొల్లంపల్లి తండాలో 150 కుటుంబాలు, వెయ్యిలోపు జనాభా ఉంటుంది. 85 శాతానికి పైగా గిరిజన తెగకు చెందిన ప్రజలు నివాసం ఉండే ఆ గ్రామం ప్రధాన జీవనాధారం పశుపోషణ, వ్యవసాయం. సమీపంలో సుమారుగా వెయ్యి ఎకరాలకు వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. వివిధ పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్న ఆ గ్రామస్థులకు నాలుగేళ్ల క్రితం గ్రామానికి అర కిలోమీటర్లులో ఏర్పాటు చేసిన ఓ క్వారీ, క్రషర్ యూనిట్ కుంపటిలా మంట రేపింది. కంకర క్రషింగ్ కోసం సమీపంలోనే క్వారీ మైనింగ్ కోసం గనులు భూగర్భ వనరుల శాఖ అనుమతులు తీసుకున్నారు. అయితే బోరు ఘాతాలు వేసి, సాయంత్రం 4-6 గంటల మధ్యలో బ్లాసింగ్ చేస్తుండడంతో భారీ శబ్దాలకు ఊరుఊరంతా దద్దరిల్లుతుందని, ఇంట్లో సామాన్లు కింద పడిపోతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు 20-30 టన్నుల కంకరతో వెళ్లే టిప్పర్ల వేగం ఒత్తిడికి ఉల్లిందకొండ నుంచి కొల్లంపల్లి గ్రామం వరకు దాదాపు 4 కిలోమీటర్లు రహదారి గుంతలమయంగా మారింది. ఆ రోడ్డులో ఆటోలను మళ్లించేందుకు కూడా డ్రైవర్లు జంకుతున్నారు. ఈ క్వారీ మాకొద్దు.. మా గ్రామానికి రక్షణ కల్పించాలని పలుమార్లు అడ్డుకున్నా ప్రయోజనం లేదు.

క్వారీ యజమానికి ఉన్న రాజకీయ కలుకుబడితో పోలీసులు, అధికారులు భయపెట్టిస్తున్నారని గ్రామస్థులు ఏకరువు పెడుతున్నారు. గ్రామానికి జీవనాడి అయిన చెరువు గట్టుపై లారీలో తిప్పుతున్నారని, ఏ క్షణంలో గట్టు తెగిపోతుందో అని భయాందోళలను వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఫోర్‌షోర్ ఏరియాను అక్రమించి క్వారీకి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారని, ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా భయపెట్టిస్తున్నారని ఆరోపించారు. అంతేకాదు క్రషర్ నుంచి వచ్చే కంకర ధూళి, దుమ్ము పంటలపై చేరడంతో పైర్లు నాశనం అవుతున్నాయని, దిగుబడి రూపంలో తీవ్రంగా నష్టపోతున్నామని అంటున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషాను కలసి తమ గోడును విన్నవించారు. న్యాయం చేస్తానని కలెక్టరు హామీ ఇచ్చారు. అంతకుముందు తమ గ్రామానికి తలనొప్పిగా మారిన క్వారీ నుంచి రక్షణ కల్పించాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

పోలీసులతో భయపెడుతున్నారు



మా పల్లెకు అర కిలోమీటరు దూరంలో క్వారీ, క్రషర్ యూనిట్ ఏర్పాటు చేశారు. 30 టన్నులు వచ్చిపోయే టిప్పర్ల వేగానికి చెరువు గట్టు దెబ్బ తింటుంది. రోడ్లు గుంతల మయంగా మారి దెబ్బతిన్నాయి. చెరువును కబ్జా చేసి రోడ్డు వేశారు. రెండేళ్ల క్రితం గ్రామస్తులంతా ఏకమై నిలదీస్తే తారురోడ్డు వేయిస్తానని మాట ఇచ్చినా ఇంత వరకు పట్టించుకోలేదు. క్వారీ నుంచి మా గ్రామానికి రక్షణ కల్పించాలి. **- రత్నానాయక్, కొల్లంపల్లి తండా**

భారీ శబ్దాలకు ఇళ్లు పగుళ్లు



క్వారీ వల్ల మేం అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. బోరు ఘాతాలు వేసి సాయంత్రం 4-5 గంటల సమయంలో బ్లాస్టింగ్ చేస్తున్నారు. భారీ శబ్దాలకు ఊరుఊరంతా వణిపోతోంది. ఇళ్లు పగుళ్లు ఇస్తున్నాయి. పంట పొలాలు క్రషింగ్ దుమ్ముతో నిండిపోయి నష్టపోతున్నాం. ఈ క్వారీ మాకొద్దు సారూ..! కలెక్టరు సారే న్యాయం చేయాలి. **- ఎం.దీపానాయక్, ఉప సర్పంచ్, కొల్లంపల్లి గ్రామం**

చెరువును నింపాలి



మా ఊరు చెరువు కింద 85 ఎకరాల ఆయకట్టు ఉంది. హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపుతామని పైపులైన్ వేశారు. నీళ్లు వదలలేదు. తక్షణమే చెరువును నింపాలి. చెరువు గట్టుపై క్వారీ టిప్పర్లు రాకుండా నియంత్రించాలి. చెరువును అక్రమించి రోడ్డు వేసిన క్వారీ యజమానిపై చర్యలు తీసుకోవాలి. **- జె.సోమనాయక్, రైతు**

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆదోని రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన కురువ తిమ్మప్ప(25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. ఆదివారం రాత్రి గ్రామంలోని మహబూబ్‌బాష ఇంట్లో సెంట్రింగ్ పనులు చేస్తుండగా, తిమ్మప్ప చేతిలోని ఇనుక కడ్డీ విద్యుత్ తీగ తగిలి కరెంటు ప్రసరించి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడి భార్య మూడు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ముగ్గురి అరెస్టు

- నకిలీ పాస్ పుస్తకాలు, నకిలీ టైటిల్ డీడ్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్

కోవెలకుంట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాల కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12 నకిలీ పాస్‌బుక్‌లు, ఐదు నకిలీ టైటిల్‌డీడ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. కోవెలకుంట్లలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం సీఐ హనుమంతనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడిం టచారు. 2023లో సంజామల తహసీల్దారు జీవీ మల్లికార్జున రావు ఫిర్యాదు మేరకు సంజామల పోలీసు స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదయింది. సంజామల తహసీల్దారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటరుగా పనిచేస్తున్న బషీర్ అహ్మద్, సంజామలకు చెందిన సాయ బోయిన ఉపేంద్ర కలిసి పేరుసోముల, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, ముదిగేడు తదితర గ్రామాల్లో లేని భూములను ఉన్నట్లుగా చూపుతూ కొత్త సర్వేనంబర్లు సృష్టించి సుమారు 55 మందికి నకిలీ పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో కూడా ఎక్కించారు. ఒక్కొక్కరికి ఐదు ఎకరాల చొప్పున పాస్‌బుక్కులు ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు తీకున్నారు. వీరిలో 49 మంది వేర్వేరు బ్యాంకుల్లో సుమారు రూ.80 లక్షల వరకు రుణం తీసుకున్నారు. ఉపేంద్ర, బషీర్ అహ్మద్ వారికి తెలిసిన సంజామలకు చెందిన ఇబూరి ప్రసాద్, గడివేములకు చెందిన దూదేకుల మహ్మద్ రఫీ, దూదేకుల పెద్ద జమాల్‌బాషా, కర్నూలుకు చెందిన అబ్దుల్ సత్తార్, కంపమల్లకు చెందిన వరప్రసాద్ కలిసి అమాయకులను ఎంపిక చేసుకున్నారు. వారికి నిజం చెప్పకుండా లేని భూమిని ఉన్నట్లుగా చెప్పి నకిలీ పాస్‌బుక్కులు ఇవ్వడంతో పాటు 2018లో అప్పటి తహసీల్దార్ ఎలిజబెత్ ఆన్‌లైన్‌కు అప్రూవల్ చేశారు. 06 సర్వే నెంబరు సృష్టించి 321.83 ఎకరాలు లేని భూమి ఉన్నట్లుగా చూపించి 67 మందికి ఆన్‌లైన్ ఎక్కించి 55 మందికి పాస్‌బుక్కులు ఇచ్చారు. ఈ పాస్‌బుక్‌లు తీసుకున్న వారందరూ సంజామల, కోవెలకుంట్ల, గడివేముల, నందికొట్కూరు, కర్నూలు జిల్లాకు చెందిన వారిగా తెలిసింది. బ్యాంకుల్లో నకిలీ పాసు పుస్తకాలు పెట్టి రుణాలు తీసుకున్న వారు తిరిగి రుణాన్ని చెల్లించాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. సంజామల గ్రామానికి చెందిన సాయ బోయిన ఉపేంద్ర, ఇపూరి వరప్రసాద్, దూదేకుల మహ్మద్‌రఫీని విచారించినట్లు తెలిపారు. సంజామల ఎస్‌ఐ రమణయ్య ఉన్నారు.

విచారణకు హాజరైన కాటసాని ఓబుల్‌రెడ్డి

డోన్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్‌రెడ్డిని డోన్ డీఎస్పీ శ్రీనివాసు లు సోమవారం విచారించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో అడ్వకేట్ అబ్దుల్ ఖైర్ సమక్షంలో ఐదు గంటలకుపైగా ఈ విచారణ కొనసాగింది. డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతేడాది మే నెలలో జరిగిన బనగానపల్లె మార్కెట్ కాంట్రాక్టుకు సంబంధించిన విషయంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసుపై విచారించినట్లు తెలిపారు. ఆ కేసుకు సంబంధించి కాటసాని ఓబుల్‌రెడ్డి హాజరు కావాలని గతంలో నోటీసులు ఇచ్చింది. ముందస్తు బెయిల్‌తో పాటు అడ్వకేట్ సమక్షంలో విచారిం చాలని ఓబుల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ మేరకు ఓబుల్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇవ్వడంతో పాటు అడ్వకేట్ సమక్షంలో విచారణ చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. డోన్ డీఎస్పీ సోమవారం అడ్వకేట్ సమక్షంలో విచారణ చేశారు. స్టేట్‌మెంట్ రికార్డు చేసి హైకోర్టుకు పంపించామని డీఎస్పీ చెప్పారు. డీఎస్పీ మాట్లాడుతూ గతంలో ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు ఇటీవల బనగానపల్లెలో ఓ సమావేశంలో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కేసు నమోదైందని, అలాగే ఓబుల్‌రెడ్డిపై కేసు నమోదైందని తెలిపారు. కాటసాని ఓబుల్‌రెడ్డితో పాటు అనుచరులు దుర్గా, టోపి అబ్బాస్‌తో పాటు మరికొంత మందిపై కేసులు నమోదైనట్లు తెలిపారు.



విచారణ అనంతరం బయటకు వస్తున్న కాటసాని ఓబుల్‌రెడ్డి

- అడ్వకేట్ సమక్షంలో 5గంటలకు పైగా విచారించిన డోన్ డీఎస్పీ

వసతి గృహాల్లో సామర్థ్యం పెంచాలి

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి



మాట్లాడుతున్న మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో సామర్థ్యం పెంచాలని అందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సాయంత్రం మంత్రి కలెక్టర్ రాజకుమారి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాకు వసతి గృహాల మరమ్మత్తులకు రూ.9.30 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో యంత్రాంగం విఫలమైందన్నారు. వెల్పనూరు, వెంకటాపురం, శ్రీశైలం, ఆత్మకూరు. నందికొట్కూరు వసతి గృహాల్లో తక్కువ అడ్మిషన్లు ఉన్నాయని, అసలు అధికారులు ఎందుకు అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇలా అయితే తక్కువ శాతం విద్యార్థులు ఉన్నచోట చర్యలు తీసుకోవడానికి ఏ మాత్రం వెనుకాడబోమన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల మార్కుల శాతం పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వసతి గృహాల్లో రక్తహీనత ఉన్న విద్యార్థినులకు సరైన పోషకాలు అందించాలన్నారు. జిల్లాలో వసతి గృహాల్లో చదువుకునే 10వ తరగతి విద్యార్థులు ఐదుమంది, జూనియర్ ఇంటర్ విద్యార్థులు 124 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 31 మంది ఫెయిల్ అయ్యారని, దీనిపై కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో 57 షాపింగ్స్, 46 ఫంక్షన్‌హాల్స్ ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని ఉపయోగించుకుని ఆదాయ వనరులు పెంచాలన్నారు. చెవిటి, మూగ బదిరుల పాఠశాలల్లోని బాత్రూంలలో కాలింగ్ బెల్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో నంద్యాల, కర్నూలు సాంఘిక సంక్షేమ అధికారులు చింతామణి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధం

- నంద్యాల జిల్లా ఇన్‌చార్జి రమేష్ నాయుడు
- నూతన కార్యవర్గం ఎంపిక

నంద్యాల కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు అబిరుచి మధు అన్నారు. నంద్యాలలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా కమిటీని ప్రకటించారు. వారు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా కమిటీని ప్రకటించామన్నారు. పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్లుగా డోన్‌కు ఎస్వీ రమణ, నంద్యాల నిమ్మకాయల సుధాకర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, పసుపుల రవీంద్రకుమార్, బనగానపల్లె ఎస్కే చాందిని, శ్రీశైలం దుంపటి మురళీధర్ చౌదరి, జిల్లా జనరల్ సెక్రటరీలుగా డోన్ కిరణ్, నంద్యాల కశెట్టి చంద్రశేఖర్, బనగానపల్లె శివకృష్ణ యాదవ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా సెక్రటరీలుగా డోన్ పత్తి నాగమోహన్, నంద్యాల ఇనుగూరి జయలక్ష్మి, కె. భరత్‌కుమార్, ఆళ్లగడ్డ మనుప్రియా రెడ్డి, నందికొట్కూరు శంకర్‌గౌడ్, నంద్యాల రోజమ్మ, జిల్లా ట్రెజరర్‌గా నంద్యాల పసుపుల శివసాయి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీశైలం చింతా నాగేశ్వర రావు, జిల్లా ఐటీ కన్వీనర్‌గా వీరేశ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని వాహనంలోకి చేర్చుతున్న సీఐ రాము, కానిస్టేబుల్

ఆత్మకూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపనంపతాపురం గ్రామ శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వడ్లరామాపురం గ్రామానికి చెందిన సురేష్, నాగరాజు, వెంకటేశ్వర్లులు ఓ బైక్‌పై వెలుగోడు రిజర్వాయర్‌ను సందర్శించి తిరుగు ప్రయాణంలో బాపనంతాపురం గ్రామ శివార్లలోకి చేరుకోగానే వారికి రోడ్డుపై బర్రెలు అడ్డు రావడంతో ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. దీంతో నాగరాజుకు తీవ్ర గాయాలు కాగా, సురేష్, వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయి. మంత్రి బందోబస్తు కోసం అటుగా వెళుతున్న సీఐ రాము, కానిస్టేబుల్ సాగర్ వారిని హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నంద్యాల కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్లు!

- దేశ వ్యాప్తంగా సరఫరా • బైక్‌ల రికవరీతో కదిలిన డొంక • నలుగురు నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బైకుల చోరీలో దర్యాప్తు చేసిన పోలీసులు నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసే ముఠా గుట్టును రట్టు చేశారు. కర్నూలు త్రీటౌన్ పోలీసులు ఇటీవల ఈ నెల 14వ తేదీన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసులో లోతుగా దర్యాప్తు చేస్తే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల ఆర్టీఏ బ్రోకర్లకు నకిలీ ఆర్సీలు తయారు చేయించి ఇస్తున్న ముఠా పట్టుబడింది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం సాయంత్రం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, త్రీటౌన్ సీఐ శేషయ్యలు వెల్లడించారు. నిందితులు షేక్ షాఫీర్‌బాషా (చాంద్‌బాడ, నంద్యాల), షేక్ సుభాన్ (బాల్‌కొండహాల్, నంద్యాల), సుధీర్‌బాబు (వీసీ కాలనీ, నంద్యాల), పెనుగొండ సూరప్ప (రెవెన్యూ కాలనీ, కర్నూలు)లను అరెస్టు చేశారు. నంద్యాల కేంద్రంగా నడిపిన నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠాకు షేక్ షాఫీర్ బాషా నాయకుడు. షేక్ సుభాన్, సుదీర్‌బాబు, పెనుగొండ సూరప్పలు వారికి కావాల్సిన నకిలీ ఆర్సీలు, ఐటీఐ సర్టిఫికెట్లు తదితర వాటిని తయారు చేయించుకుంటారు. ఇప్పటి వరకు సుధీర్ బాబు అనే నిందితుడు 150 డూప్లికేట్ ఆర్సీలు, పోలీసు ఎన్‌వోసీలు షాఫీర్‌బాషా వద్ద తయారు చేయించుకున్నాడు. పెనుగొండ సూరప్ప అనే వ్యక్తి డోన్ ఐటీఐ కాలేజీలో పని చేస్తూ సుమారు 500 నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లు తయారు చేయించుకున్నాడు. సుభాన్ అనే నిందితుడు 50 డూప్లికేట్ ఆర్సీలు తయారు చేయించుకున్నారు. దీంతో పాటు షాఫీర్‌బాషా, సుబాన్‌లు కలిసి ఫేస్‌బుక్‌లో 'పీవీసీ చిప్ కార్డులు దొరుకును' అంటూ వివిధ భాషల్లో ఓ ప్రకటనను ఇచ్చుకుని వ్యాపారాన్ని కొనసాగించారు.

ఈ ప్రకటనను చూసిన పలు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, పుదుచ్చేరి, కేరళ, ఒరిస్సా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆర్టీఏ బ్రోకర్లు వీరిని సంప్రదించారు. అక్కడి నుంచి వారు తమకు అవసరమైన డేటాను షాఫీర్, సుబాన్‌లకు పంపిస్తే వీరు తమ తెలివితేటలతో ఒరిజినల్‌కు ఏ మాత్రం తీసిపోకుండా నకిలీ ఆర్సీలు తయారు చేసి కొరియర్ ద్వారా పంపిస్తారు. ఇలా తమ దందా కొనసాగిస్తూ వచ్చారు.

బైకుల రికవరిలో ఆరా తీస్తే.. ఈ నిందితుల బాగోతం బయటకు వచ్చింది. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 18 నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లు, 2 నకిలీ పోలీసు ఎన్‌వోసీలు, ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, ఒక సీల్, 29 నకిలీ ఆర్సీలు, ఒక ఇన్నోవా, ఒక హోండా కారు, 150 ఖాళీ పీవీసీ చిప్ కార్డులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 220 డూప్లికేట్ ఆర్సీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన సీఐలు శేషయ్య, నాగశేఖర్, ఎస్‌ఐలు చంద్ర, మల్లికార్జున, అంజనప్ప, రెహిమాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ శేఖర్, చంద్రబాబు నాయుడు కిరణ్ కుమార్, పరమేశ్వరుడు, వీరబాబులను డీఎస్పీ అభినందించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

నంద్యాల ఎస్బీ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



నంద్యాల టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్బీ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. తన పరిధిలో నేరాలను నియంత్రించిడంలో కృషి చేస్తామన్నారు. క్షణికావేశంలో నేరాలు చేయవద్దని సూచించారు. శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు సీఐలు, ఎస్ఐలు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి పీఠాధిపతి 13వ చాతుర్మాస దీక్ష

- 49 రోజులు మంత్రాలయం సరిహద్దులు దాటకుండా పూజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన శ్రీమఠం అధికారులు



మంత్రాలయం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తన 13వ చాతుర్మాస దీక్షలు ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 49 రోజులు చాతుర్మాస దీక్ష స్వీకరించనున్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్వపీఠం అనుసరించి శ్రీమఠం సంప్రదాయ పద్ధతిలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య దండకం చేతపట్టి మూల రాములకు, రాఘవేంద్రస్వామి బంగారు పాదాలకు పూజలు చేయగా మహిళలు హారతులు ఇవ్వనున్నారు.

శ్రీమఠం పండితులు సుజీంద్రాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, శ్రీనాథాచార్, వాధిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, వెంకటేష్‌జోషీ, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తు 13వ చాతుర్మాసదీక్షలు మంత్రాలయంలోనే కొనసాగించాలని ఆహ్వానిస్తారు. ఈదీక్షకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 8 వరకు 49 రోజులు మంత్రాలయం సరిహద్దులు దాటకుండా మంత్రాలయంలోనే ఉంటూ భక్తులకు అందుబాటులో ఉండి పూజలు చేసి భక్తులను ఆశీర్వదిస్తారు. ఎంతో పవిత్రమైన చాతుర్మాస దీక్షలు స్వీకరణ చేసి సెప్టెంబరు 8న విరమణ సమయంలో భారీ ఊరేగింపు నిర్వహించి సంబరాలు నిర్వహిస్తారు.

అంగన్‌వాడీలకు ఒకే యాప్ అమలు చేయాలి

కర్నూలు సీడీపీవో ఆఫీసు ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కర్నూలు హాస్పిటల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉన్న అన్ని యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ వారు సీడీపీవో ఆఫీసు ఎదుట ధర్నా చేశారు. నిర్మలమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 42 రోజుల సమ్మె చేశారని, కానీ ఆ డిమాండ్లను ఇంత వరకు కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. నూతన ప్రభుత్వం కొత్త యాప్‌లను తెచ్చి వర్కర్స్‌ను మానసికంగా వేధిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు విజయమ్మ, జిల్లా నాయకులు బాలదుర్గమ్మ, సీఐటీయూ నాయకులు సాయిబాబు, సిటీ సెక్రటరీ విజయబాబామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

నగర పాలక కమిషనర్ విశ్వనాథ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ లీల ప్రసాద్, ఆర్‌ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

● స్వచ్ఛాంధ్ర క్లాప్ డ్రైవర్లకు 5 నెలల పెండింగ్ జీతాలు ఇప్పించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఐదు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఆదేశించారు.

గిరిజనులకు రుణాలు మంజూరు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనులకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కొండయ్యను కలిసి ఏపీ గిరిజన ప్రజా సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజూ నాయక్ సోమవారం వినతిపత్రం అందజేశారు. రాజూ నాయక్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల వర్కర్లకు వేతనాలు చెల్లించాలన్నారు. ఆర్వోఎఫ్ ఆర్ ల్యాండ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో అట్టడుగున నివసిస్తున్న గిరిజనులకు ఎటువంటి బ్యాంక్ లింకుతో సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కొండయ్యను శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రాము నాయక్, జీపీఎస్ కార్యదర్శి రవి నాయక్, ఆలూరు ప్రజలు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: కాటసాని

కల్లూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా 33వ వార్డు పాత కల్లూరులో పర్యటించి కూటమి పథకాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో 33, 32, 28వ వార్డుల కార్పొరేటర్లు ఎం.నరసింహులు, సానా శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, రంగప్ప, జగదీష్, సుబ్బారెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో కార్డియో పల్మనరీ పునరుజ్జీవన ప్రదర్శన

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో సోమవారం కార్డియో పల్మనరీ పునరుజ్జీవన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానంద్‌బాబు, డా.రత్నాకర్ రెడ్డి, ఆధ్వర్యంలో హృదయ స్పందనలు ఆగిపోయినప్పుడు వాటిని ఎలా తిరిగి ప్రారంభింపజేసి మనిషి పునరుజ్జీవితులను ఎలా చేయాలో విద్యార్థులకు బొమ్మల సాయంతో ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాజ్యోతి, కోఆర్డినేటర్లు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు హాస్పిటల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కారానికి కృషి చేస్తానని డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ఆశా కార్యకర్తల ఫిర్యాదుల పరిష్కార వేదికను డీఎంహెచ్‌వో నిర్వహించారు. జిల్లాలో పని చేస్తున్న ఆశా వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డీఎంహెచ్‌వోకు వినతి పత్రం సమర్పిం చారు. కార్యక్రమంలో డీఐవో డా.నాగప్రసాద్‌బాబు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.మహేశ్వర ప్రసాద్, ఇన్‌చార్జి డీపీహెచ్‌ఎన్‌వో అన్నపూర్ణమ్మ, సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

అధికారులపై బెదిరింపులు తగదు

కర్నూలు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గ్రామ పంచాయతీ అధికారి నాగరాజు నాయుడుని జేసీ ప్రభాకర్ రెడ్డి బెదిరించడం సరికాదని ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు గురుస్వామి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను బెదిరించి పనులు చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో శేషన్న, షేక్షావలి, వేణుగోపాల్, చెన్నయ్య, శ్రావణ్ నాయక్ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ మరమ్మతులకు నిధులు విడుదల చేసిందని, వాటిని వినియోగించకోకుండా స్వాహా చేసిన హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ కుమార్ కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ హాస్టల్ మరమ్మతుల కోసం కోట్ల రూపాయలు విడుదల చేసిందన్నారు. వార్డెన్లు హాస్టల్‌లో ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ఆ నిధులను స్వాహా చేశారన్నారు. అవినీతికి పాల్పడిన హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యన్ సందీప్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

● **సీఆర్‌టీల అక్రమ రెగ్యులరైజేషన్ రద్దు చేయాలి:** జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న సీఆర్‌టీల అక్రమ రెగ్యులరైజేషన్ రద్దు చేయాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రూప్లా నాయక్, ప్రసన్నలక్ష్మి, పెద్దయ్య, సీఆర్‌టీ ఉపాధ్యాయులను అక్రమంగా గత గిరిజన సంక్షేమ శాఖాధికారిగా పని చేసిన శ్రీనివాసకుమార్ రెగ్యులరైజేషన్ చేశారు. డీఎస్సీ ద్వారా సెలెక్ట్ అయి గత కొన్ని సంవత్సరాలుగా రెగ్యులర్ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ రావడం లేదన్నారు.

బోగస్ గిరిజన ఉద్యోగులను తొలగించాలి: జిల్లాలో బోగస్ గిరిజన ఉద్యోగులను తొలగించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చంద్రప్ప మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నార న్నారు. వారిపై విచారణ చేపట్టాలని కోరారు.

కల్లూరు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి: కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగరానికి చెందిన షేక్ మహబూబ్‌బీ కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కారల్ మార్క్స్‌నగర్‌లో ఉన్న ప్రభు త్వ ఇంటి పట్టాను 2022లో కుటుంబ సభ్యులు నాకు ఇచ్చారన్నారు. ఆస్తి కోసం మా అన్న 2023లో ఇంటి నుంచి బయటకు పంపించారన్నారు. అనంతరం మా అన్న నా పేరుపై ఉన్న ప్రభుత్వ ఇంటి పట్టాను, కరెంటు బిల్లు, ఇంటి పన్ను మార్చారని తెలిపారు. ప్రభుత్వ పట్టాను మార్చిన వీఆర్వోలు ఖాదర్‌బాషా, మహేశ్వరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయాలి: కర్నూలు మండలంలోని గ్రామ పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ ద్వారా రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరుతూ కర్నూలు మండలం సర్పంచుల సంఘం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘం నాయకులు ధర్నా చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జిలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షాహిద్, జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్, మద్రిస్వామి, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని సీపీఎం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

కర్నూలు న్యూసిటీ: జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు రోడ్డు నిర్మించాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట స్థానికులతో కలిసి ధర్నా చేశారు. నిర్మల మాట్లాడుతూ వెంకాయపల్లె రోడ్డు వేసి 20 సంవత్సరాలు అవుతుందని, ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి గుంతలు ఏర్పడిన కూడ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కార్యవర్గసభ్యులు విజయరామాంజనేయులు, నాగరాజు, నాయకులు మహమ్మద్, రంగస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అయ్యవారి నాగలాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం 35, 36 వార్డుల పరిధిలోని గనిగుంతలు, అయ్యవారి నాగలాపురంలో టీటీడీ బోర్డ్ సభ్యుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. 35వ వార్డు గనిగుంతల్లో రూ.35 లక్షలు, అయ్యవారి నాగలాపురంలో రూ.20 లక్షలతో డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి తిరుమలేశ్వరరెడ్డి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ లోకేశ్వర రెడ్డి, ఎన్వీ రామకృష్ణ, పీయూ.మాదన్న, రవిప్రకాష్‌రెడ్డి, కేతూరు మధు, మాదేష్, పెద్ద బీచుపల్లి, సుబ్బారెడ్డి, చక్రపాణిరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జీవన ఎరువులను వాడాలి: కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఆర్డీవో తదితరులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులకు బదులుగా పచ్చిరొట్ట, జీవన ఎరువులను వాడడం ద్వారా భూమి సారవంతం అవుతుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పచ్చిరొట్ట, జీవన ఎరువులు వినియోగానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో భూమి సారవంతం అవుతుందని, తద్వారా నాణ్యమైన దిగుబడులు పొందేందుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి: ఏపీఎం

సి.బెళగల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని వెలుగు ఏపీఎం రమేష్ అన్నారు. సోమవారం మండల వెలుగు కార్యాలయంలో బుక్‌కీపర్లతో ఆయన సమావేశమ్యారు. బుక్‌కీపర్లు, సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

23, 24న నీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు న్యూసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మునగాల పాడు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్‌నగర్ వద్ద ఫిల్టర్ బెడ్స్‌కు నీటి సరఫరా చేసే 1200 ఎంఎం డయా పైపులైన్ లీకేజీ పనులు చేపట్టడం వలన నగరంలో ఈ నెల 23, 24 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించి నగర పాలక సంస్థ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జీవో జారీపై హర్షం

కర్నూలు న్యూసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచుతూ జీవో 124 జారీ చేయడంపై కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష హర్షం వ్యక్తం చేశారు. సోమవారం బిర్లా కాంపౌండ సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా నాన్ పీహెచ్ వర్కర్లు చేపట్టిన సమ్మెకు ప్రభుత్వం స్పందించి మూడు కేటగిరిల ఉద్యోగులకు రూ.3వేలు పెంచడం శుభపరిణామమన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల జీతాల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీఈటీలు, ఎస్ఏ పీఈ అసోసియేషన్ నిర్వహక కార్యదర్శి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య, చందూ నాయక్ కోరారు. సోమవారం డీఈవో శామ్యూల్‌పాల్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. వ్యాయామ ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులపై, బదిలీ ప్రమోషన్లలో పీఈటీ, పీడీలకు జరిగిన అన్యాయంపై డీఈవోతో సంఘం నాయకులు చర్చించారు. సంఘం ప్రతినిధులు అస్లాం బాషా, సత్యకుమార్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏడీఏ



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏడీఏలు

కల్లూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కర్నూలు సహాయ వ్యవసాయ సంచాలకులు సాలురెడ్డి సూచించారు. సోమవారం కల్లూరు మండలం ఓబులాపురం తాండలో జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) ఆధ్వర్యంలో ఎస్టీ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాసయోజన పథకంలో భాగంగా రైతులకు పంటల సాగులో అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు, కల్లూరు ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి డీఆర్సీ వ్యవసాయ అధికారి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

కర్నూలు అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): నెపాల్‌లో జరిగే అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారుడు మహేష్‌ను రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) ఉపకుల పతి వి.వెంకట బసవ రావు అభినందించారు. సోమవారం ఆర్‌యూలో ప్రభుత్వ బాలుర డిగ్రీ ద్వితీయ బీఎస్సీ విద్యార్థి వై.మహేష్‌ను ఉపకులపతిలోపాటు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అభినందించారు. వీసీ మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతరం శ్రమిస్తే జాతీయ, అంత ర్జాతీయ స్థాయిలో పతకాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయకు మార్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

కర్నూలు రూరల్ జూలై 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురం 39వ వార్డుకు చెందిన బుగిడె రాధ కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతోంది. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో ఆమె ఆర్థిక సాయం కోసం ఎమ్మెల్యే దస్తగిరిని ఆశ్రయించింది. స్పందించిన ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ కింద రాధమ్మకు రూ.53,783లను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును ఎమ్మెల్యే సోమవారం తన నివాసంలో రాధమ్మకు అందజేశారు. అంతేకాకుండా గూడూరు మండలం ఆర్. ఖానాపురం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి గత కొంతకాలం గా తీవ్ర అనారో గ్యానికి గురయ్యారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించగా ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.72106లను మం జూరు చేయించారు. చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా విష్ణువర్ధన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కేరళ మాజీ సీఎం మృతికి నివాళి

కర్నూలు న్యూసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్.అచ్యుతానందన్ మృతికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేకే భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఎండీ అంజిబాబు మాట్లాడుతూ కేరళలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. 2006-2011 వరకు కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడు దఫాలు ప్రతిపక్ష నాయకుడికగా కేరళ ప్రజానీకానికి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు టి.రాముడు, వెంకటేశ్వర్లు, గురుశేఖర్, రాజశేఖర్, సీహెచ్ సాయిబాబా పాల్గొన్నారు.

● కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చేసిన సేవలను, పోరాటాలను కొనియాడారు. అనంతరం ఆయన మృతికి గిడ్డయ్య సంతాపం తెలిపారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఇన్‌స్ట్రక్టర్స్ అనే అంశంపై ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమా వేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఎంఈవోలు ఓంకార్ యాదవ్, శ్రీధర్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులు, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్ రూముల పార్టిషన్ తదితర విషయాలను వారు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సి.బెళగల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకుదొడ్డి, సంగాల గ్రామాల్లోని జడ్పీహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో ఆదాంబాషా సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఆట పాటలతో చదువు చెప్పాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

గూడూరు సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీధర్ గుప్తా

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీధర్ గుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్ గుప్తాకు సీనియర్ అసిస్టెంట్ అనిత, జూనియర్ అసిస్టెంట్ రాధ, సిబ్బంది విజయ్, నాగరాజు, డాక్యుమెంట్ రైటర్లు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. శ్రీధర్ గుప్తా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు వలి, నజీర్, జిలాని, రవి, కోటి, సుర్రేంద, శ్రీకాంత్, శివయ్య, ప్రభాకర్, భాస్కర్, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున, ఈరన్న పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడుతున్నారు

వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు

కర్నూలు న్యూసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతుందని వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు అన్నారు. సోమవారం ఎన్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం మొత్తం అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తుంటే ఏపీలో నారా రాజ్యాంగం నడుస్తుందన్నారు. మూడు రోజుల క్రితం బీసీ మహిళా జడ్పీ చైర్‌పర్సన్ హారిక, అలాగే తాడిపత్రిలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడపై దాడి చేయడం అమానుషచర్యగా భావించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ యాదవ్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు స్వాములు నీలకంఠం పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాబోయే నాలుగేళ్లలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో సోమవారం సుపరిపాలనపై తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో కాలువలు, సీసీ రోడ్లు లేవని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకెపోగు జయన్న, ఎంపీటీసీ మద్దిలేటి, పేరపోగు రాజు, రామకృష్ణ, కిశోర్, పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు: కూటమి ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం పర్లలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ఆమె ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. గౌరు చరిత మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ డి.రామాంజనేయులు, కల్లూరు సహకార సంఘం చైర్మన్ శేఖర్, ఎంపీటీసీ ఎం.శేషన్న, మహానంది, రామగిడ్డయ్య, రవి, వెంకటేష్, వాకిటి మాదేష్, దేవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని ఆయా కాలనీల్లో పట్టణ రామాంజనేయులు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు సృజన్, నాగప్ప యాదవ్, కురువ హనుమంతు, వీర కుమార్, గౌండ రాజు, ప్రభాకర్ నాయుడు, కళ్యాణ్ రఘు పాల్గొన్నారు.



బి.తాండ్రపాడులో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కోడుమూరు తెలుగు యువత అధ్యక్షుడు కొత్తకోట హరి అన్నారు. సోమవారం సి.బెళగల్ మండలం శింగవరం గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయ పాటి శ్రీనివాసులు, తిమ్మప్ప, రంగన్న పాల్గొన్నారు.

మైదానాలను అభివృద్ధి చేయాలి


డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న చందు నాయక్

తుగ్గలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం పాఠశాలల్లో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్, అస్లాం కోరారు. సోమవారం కర్నూలులో డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం ఇచ్చారు.

విద్యార్థులందరికీ సీట్లు ఇవ్వాలి


సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న తిరుమలేష్

ఆదోని, జూలై 21(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసిన విద్యార్థులందరికీ పట్టణంలోని ప్రభుత్వ హాస్టళ్లలో సీటు కేటాయించాలని పీడీఎస్‌యూ నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. సీటు కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు హాస్టళ్ల చుట్టూ తిరుగుతున్నారని, సీట్లు లేకపోతే మరో హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గణేష్, ప్రవీణ్, రాజేష్ పాల్గొన్నారు.

రహదారులను బాగుచేయాలి


ఎస్ఈ మహేశ్వరరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఆలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రహదారులను బాగుచేయాలని ఎమ్మెల్యే విరుపాక్షి కోరారు. సోమవారం కర్నూలులో ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చామన్నారు. రహదారులు వర్షం ప్రభావంతో దెబ్బతిన్నాయని, హెబ్బటం-హొళగుంద రోడ్డును నిర్మించాలని కోరినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి నాడు-నేడులో ఆగిపోయిన అదనపు తరగతుల నిర్మాణాలను పూర్తి చేయాలని డీఈవో శామ్యూల్‌పాల్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. నాయకులు ఎస్.కె.గిరి ఉన్నారు.

బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా గోవిందరావు


గోవిందరావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రసాలే గోవిందరావును నియమించినట్లు ఆ పార్టీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులు గోవిందరావును సన్మానించారు. తనకు ఎంపిక చేసిన నాయకులకు గోవిందరావు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు దేశాయి చంద్రన్న, ఉపేంద్ర కుమార్, పంపాపతి నాయుడు పాల్గొన్నారు.

'స్వకుళ సాళే' కార్యదర్శిగా రాజేశ్వరి



ఆదోని టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మలేకర్ రాజేశ్వరి స్వకుళ సాళే సంఘం మహిళా మండలి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. సోమవారం మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల్లో అఖిల భారతీయ మహా పరిషత్ కార్యక్రమం నిర్వహణకు తీర్మానించారన్నారు. అందరి సహకారంతో విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి


మిద్దెతండాలో పథకాలు వివరిస్తున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతోనే గిరిజనులు అభివృద్ధి చెందుతారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, వెంకటస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని మిద్దె తండా, చిగుర్లగుట్ట తండా, లక్ష్మీతండాలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించి, సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ లక్ష్మీదేవి, వెంకట నాయక్, శంకర్ నాయక్, వీరు నాయక్, జయరాం నాయక్, రాముడు నాయక్, హనుమంతు నాయక్ ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

పత్తికొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూదేకొండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రామాంజనేయులు ఇటీవల మృతిచెందడంతో కుటుంబానికి ఎమ్మెల్యే శ్యాంబాబు రూ 50వేల సాయం అందించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో భార్య శివలక్ష్మికి పార్టీ నాయకుడు సాంబశివారెడ్డి అందించారు. బిటిగోవిందు, రంగస్వామి, మోహన్, తలారి పరమేష్, ఎం పరమేష్, ప్రకాష్‌గౌడ్, తిరుమలేష్‌గౌడ్ ఉన్నారు

రైతు ఖుషీ

- అన్నదాత సుఖీభవ జాబితా విడుదల చేసిన ప్రభుత్వం
- ఆదోని సబ్ డివిజన్‌లో 53,748 మంది రైతులకు లబ్ధి



అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో కన్నా ఎక్కువగా సాయం అందనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదోని అగ్రికల్చర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రైతులకు 'అన్నదాత సుఖీభవ పథకం' లబ్ధిదారుల జాబితా విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ఉంచారు. ఆధార్ నంబర్ ఆధారంగా రైతులు తమ పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు.

గతం కన్నా ఎక్కువగా సాయం

గంతలో వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రూ. 13,500లు ఇచ్చింది. వీటిలో పీఎం కిసాన్ కింద కేంద్రం ప్రభుత్వం రూ. 6 వేలు అందించగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 7,500 ఇచ్చేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ సాయాన్ని రూ.20 వేలకు పెంచింది. కాగా గత ప్రభుత్వ హయాంలో కొత్త భూములు కొనుగోలు చేసుకున్న వారి వివరాలు నమోదు అయి ఉండేవి కాదు. 2019 వెబ్ ల్యాండ్ ప్రకారమే అన్నదాత సుఖీభవ ఇచ్చేవారు. దీంతో వేలాది మంది రైతులు ఇబ్బంది పడేవారు.

రైతుల జాబితా సిద్ధం చేశాం



'అన్నదాత సుఖీభవ'కు గ్రామాల వారీగా రైతుల జాబితాను సిద్ధం చేశాం. త్వరలోనే వారి ఖాతాల్లో మొదటి విడత సాయం జమవుతుంది. తమ పేర్లు లేని రైతులు రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు అందించవచ్చు.

- బాలవర్ధిని రాజు, ఏడీఏ, ఆదోని

డివిజన్‌లో 53,748 మంది అర్హులు

ఆదోని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆదోని, కౌతాళం, కోసిగి,పెద్ద కడుబూరు మండలాల్లో మొత్తం 53,748 మంది రైతులు 'అన్నదాత సుఖీభవ'కు అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరికి మొదటి విడతలో రూ.7వేలు ఖాతా లో ప్రభుత్వం జమ చేయనుంది. మిగతా రూ.13వేలను ఆరు నెలల్లోపే అందించనున్నారు. ఇప్పటి వరకు సొంత భూమి ఉన్న రైతులకు వెబ్ ల్యాండ్ ఆధారంగానే సాయం చేస్తుండగా, ఇప్పుడు కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం ఆమోదం తెలిపితే కౌలు రైతులకు కూడా వర్తించనుంది.

మండలం	మొత్తం	అర్హులు	అనర్హులు
ఆదోని	32,866	19,190	13,676
కౌతాళం	25,365	14,869	10,496
కోసిగి	16,588	9,887	6,701
పెద్దకడుబూరు	16,255	9,802	6,453
మొత్తం	**91,074**	**53,748**	**37,326**

కల్తీ మద్యంపై ప్రజల్లో ఆగ్రహం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని/ఆదోని టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్నట్లు ఎమ్మెల్యే డా.పార్థసారథి ప్రశ్నించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రభుత్వం వచ్చాక మద్యం ధరలతో దోపిడీ చేశారని ఆరోపించారు. కల్తీ మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకున్న వారు, అనారోగ్యానికి గురైన వారు లెక్కలేనంతమంది ఉన్నారన్నారు. జగన్ హయంలో జరిగిన అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీపై చర్యలు తీసుకోడాకేఏ రాష్ట్ర ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మిసలీమ్, వెల్లాల మధుసూదన్ శర్మ, ఉపేంద్ర, నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పత్తికొండ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పేదల కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు కారుమంచి, రామాంజనేయులు శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం వి.కె.ఆదినారాయణరెడ్డి నగర్‌లో పర్యటించి, సమస్యలను తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు.


డ్రైనేజీని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

ఆదోని అగ్రికల్చర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆదోని వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏవో జయ లక్ష్మి సూచించారు. సోమవారం ఏడీఏ కార్యాలయం ఆత్మ భవన్‌లో రైతులు, గ్రామ సిబ్బందికి శిక్ష ఇచ్చారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధమైన పద్ధతిలో సాగు చేయొచ్చన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఏవో సుదాకర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టెక్నికల్ వ్యవసాయ అధికారి జయలక్ష్మి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఆలూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్స చేయించుకున్న 6 మంది బాధితులకు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ చెక్కులు పంపిణీ చేశారు. సోమవారం రూ.5,13,904ల చెక్కులను టీడీపీ కార్యాలయంలో అందించారు. అశోక్, రామ్‌నాథ్, కొమ్ము రాజు, రాముయాదవ్, రమేష్ ఉన్నారు.


చెక్కులు ఇస్తున్న వీరభద్రగౌడ్

కూరగాయల మార్కెట్ ప్రారంభం

ఆస్పరి: మండలంలోని చిగిలి గ్రామంలో కూరగాయల మార్కెట్‌ను టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సోమవారం ప్రారంభించారు. కాంట్రాక్టర్ ఈరన్న, శివ, నారాయణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మద్దికెర, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎం.అగ్రహారం గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులు స్పందించకపోవడంతో ప్రజా సమస్యల పరిష్కారవేదిక సమావేశ భవనంలోకి దూసుకెళ్లారు. ఎంపీడీవో కొండయ్యతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ గుండాల్ నాయక్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.


ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్

సేవలందించండి

హలహర్వి, జూలై21(ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందించాలని వైద్యాధికారి మన్సూర్ వలి సూచించారు. సోమవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తుండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజను అప్రమత్తం చేయాలన్నారు.

వక్ఫ్ భూముల రక్షణకు సీఎం కృషి

ఆదోని టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వక్ఫ్ భూములను రక్షించేదుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నఅ్నరని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అమ్మద్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ కృష్ణాజిల్లా పెనమలూరు నియెజకవర్గంలోని తాడిగడపలో కబ్జాకు గురైన వక్ఫ్ భూములను భూమాఫియా నుంచి కాడాడటానికి ప్రభుత్వం ఎంహెచ్‌పీఎస్ నాయకులకు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు.

కక్ష సాధింపు ఆపాలి

తుగ్గలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు ఆపాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రజలు గమనిస్తున్నారని వరే గుణపాఠం చెబుతారన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం

దేవనకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని నోడల్ అధికారి డా.రఘు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కరివేముల గ్రామం సంచార వైద్యశాలను తనిఖీ చేశారు. గర్భిణులు, మహిళలకు సుచనలు చేశారు. పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు పట్టించాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్, శీతల పానియాలకు దూరంగా ఉండాలన్నారు. వైద్యాధికారి విజయబాస్కర్, సిబ్బంది జయలక్ష్మి, సాయినందిని, రామేశ్వరి ఉన్నారు.

నిధులివ్వకుంటే పనులు ఎలా చేయాలి?

ఆస్పరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు నిధులు ఇవ్వకుంటే ఎలా పనులు చేయాలని సర్పంచ్ ఆంజనేయ ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచులు తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల సమావేశాన్ని సీపీఎం నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, సుంకన్న అడ్డుకున్నారు. ఎంపీడీవో గీతావాణి మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

వెల్దుర్తి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి క్రిష్ణగిరి మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు.

తాగునీటికి కటకట


రాంపురంలో నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

తుగ్గలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురంలో 1,500 మంది నివసిస్తున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు బోర్లు వేసి మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే వాటికి నీరు సరఫరా చేయడం లేదు. దీంతో ప్రజలు ట్యాంకులను బట్టలు ఆరేసుకోడానికి, ఇతర పనులకు వినియో గిస్తున్నారు. వ్యవసాయ బోర్లకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా నీరు రావడం లేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

సూపర్ సిక్స్‌తో ఆనందం


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఉమాపతినాయుడు

ఆదోని, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరుస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. సోమవారం ఢణాపురం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాదిలోనే 90 శాతం హామీలను అమలు చేశామని, దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా 64 లక్షల మందికి పింఛన్లను అందిస్తున్నామన్నారు. 204 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ.5కే భోజనం ఇస్తున్నామన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, రంగస్వామి నాయుడు, సాధికాబేగం, శంకర్, నీలకంఠప్ప ఉన్నారు.

చంద్రబాబు పాలనలో సుభిక్షం


హొళగుందలో కరపత్రాలు ఇస్తున్న వైకుంఠం శివ ప్రసాద్

హొళగుంద, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం హొళగుందలోని బీసీ కాలనీ, బుడగజంగల్ కాలనీ, ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ తిరిగా కరపత్రాలను పంపిణీ చేశారు. అన్నదాత సుఖీభవకు జిల్లాలో 2.56 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించామన్నారు. తిప్పయ్య, ఈడిగ గోవింద్ గౌడ్, చిన్నహ్యాట శేషగిరి, హెబ్బటం విష్ణువర్ధన్ రెడ్డి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి


సభ్యులతో గవర్నర్ నామినీ త్రివిక్రమ్ జోషి

ఆదోని అగ్రికల్చర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ త్రివిక్రమ్ జోషి పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్స్ సైన్స్ కళాశాల జూబ్లీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గవర్నర్ త్రివిక్రమ్ జోషి, అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ సత్తార్ హాజీ, ఆదిత్య నర్సింగ్ హోమ్ డాక్టర్ శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేశారు. పోలియోను అంతమొందిచడానికి క్లబ్ సేవలు మరువలేనివన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించామని, ఉచిత కంటి ఆపరేషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్ల తదితర సేవలను అందించాలని సూచించారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ సైఫుల్లా, కార్యదర్శిగా మేఘనాథ్ రెడ్డి, ట్రెజరర్ గా షణ్ముఖతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. సందీప్ రెడ్డి, జీవన్ సింగ్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ మల్లికార్జున రెడ్డి, ప్రశాంత్ గాంధీ, భరత్ షా, సునీల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాచోటి సబ్బయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా చంద్రబాబు


నల్లచెలిమలలో కరపత్రాలు ఇస్తున్న నాయకులు

దేవనకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి చిరునామా సీఎం చంద్రబాబు అని టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, సుభాన్ అన్నారు. సోమవారం మండలంలోని నల్లచెలిమల, తువ్వదొడ్డి, యంకె కోట్టాల, గుడిమిరాళ్ల, బంటుపల్లి గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'నిర్వహించారు. మలకన్న, సర్పంచ్ బాస్కర్, వెంకటస్వామిగౌడ్, ఆకుల సిద్ద, పెద్దయ్య, రుద్ర పాల్గొన్నారు.

ఎరువుల కోసం క్యూ


డీసీఎంఎస్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న రైతులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో రైతులు యూరియా కోసం పట్టణంలోని డీసీఎంఎస్ కేంద్రానికి క్యూ కట్టారు. ఎరువులు పక్కదారి పట్టకుండా చూసేందుకు ఆదోని వ్యవసాయ అధికారి కార్యాలయం వద్దే పర్మిట్లు రాసి పంపుతున్నారు. ఒక్కో రైతుకు ఐదు బస్తాలకు మించి ఇవ్వడం లేదు. గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు ఉన్నా, రైతులు మార్కెట్ యార్డ్‌లోని డీసీఎంఎస్ కేంద్రంలో అన్ని రకాల ఎరువులు ఉంటాయని అక్కడికి క్యూ కడుతున్నారు.

పీ4తో అభివృద్ధి సాధ్యం

- ఆదోని ఎంపీడీవో జనార్దన్



ఆదోని రూరల్, జూలై 21 ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీ-4 కార్యక్రమంతో అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో జనార్ధన్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన వున్న వారంతా అన్నిరకాలుగా అభివృద్ధి చెందేం దుకు ఇది దోహదపడుతుందన్నారు. తాను మండిగిరి పంచాయతీ పరిధిలో వితంతువు జి.సరిత, ఆమె కూతురిని కూతురిని దత్తత తీసుకున్నానని ఎంపీడీవో తెలిపారు.

వాల్మీకులను మోసగిస్తే పోరాటం తప్పదు


నిరసన తెలుపుతున్న వాల్మీకి నాయకులు

పత్తికొండటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను మోసగిస్తే పోరాటం తప్పదని బోయ వాల్మీకి సమితి అధ్యక్ష కార్యదర్శులు అంజి, శేఖర్‌నాయుడు, వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు సాయిబాబా అన్నారు. సోమవారం పట్టణంలో కొత్త బస్టాండు నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాజకీయ పార్టీలు నిలబెట్టుకోకుండా దాటి వేయడం తగదన్నారు. పీఎం మోదీ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కాంతమ్మ, రాముడు, ఈరన్న, మహేంద్రనాయుడు, ధనుంజయ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం అవసరం



క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎస్ఐ, టీడీపీ నాయకులు

మంత్రాలయం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు ఉన్నారని, వారిని ఆర్థికంగా ప్రోత్సహిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజులు అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలు ఇన్‌చార్జి హెచ్ఎం విఠోభరావు, గోట్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ ఆడే క్రీడాకారిణులకు రూ.10వేలు విలువ చేసే షూస్, దుస్తులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రద్ధతో చదివి.. క్రీడల్లో సమానంగా రాణించాలని కోరారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషితో ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు విద్యార్థి దశే కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర, నరసింహరాజు, ప్రసన్న కుమారి, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలి'

గోనెగండ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): చిన్నమరివీడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త గర్భవతి, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వకుండా వేధిస్తున్నారని, చిన్నమరివీడు గ్రామానికి చెందిన బాలింత బండారు తేజ, ఆమె తల్లిదండ్రులు సుశాంతు, బతకమ్మ ఆరోపించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బాలింత బండారు తేజ తన 23 రోజుల చిన్నారి, తన తల్లిదండ్రులతో కలసి నిరసన తెలిపారు. ఎంపీడీవో మణిమంజరికి తమ గోడును వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తపై తగు చర్యలు తీసుకోవాలని వారు ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఇందుకు స్పందించిన ఎంపీడీవో అంగన్‌వాడీ కార్యకర్తతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

'న్యాయం చేయాలి'

మంత్రాలయం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు వీఆర్ఏ అనిల్ కుటుంబ సభ్యులను మభ్యపెట్టి వీఆర్ఏగా చేరిన తర్వాత తమల్ని మోసం చేసి బాగోగులు పట్టించుకోవడం లేదని వీఆర్ఏ తల్లి గర్జి నరసమ్మ, అన్న మోహన్ తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు, ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, తప్పుడు సర్టిఫికేట్లు సృష్టించుకుని వీఆర్ఏగా చెలామణి అవుతున్నారని, అతన్ని విధుల నుంచి తొలగించి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అప్పటి ఆర్ఐలు, వీఆర్వోలు విచారణ చేశారని తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఉద్యమాలు ఉధృతం చేస్తాం

మంత్రాలయం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి హెబ్సిబా, కార్యదర్శులు విశాలాక్షి, భీమేశ్వరిలు అన్నారు. సోమవారం మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయం ముందు సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేశారు.





బోర్లు ఉన్నా.. అందని తాగునీరు

- ఇబ్బందుల్లో గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

ఎమ్మిగనూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడివెళ్ల గ్రామం చుట్టూ పదుల సంఖ్యలో బోర్లు ఉన్నా గ్రామస్థులకు అవసరమైన తాగునీరు అందటం లేదు. ప్రధానంగా గ్రామంలోని గంజెల్ల రోడ్డు వైపు యల్లమ్మ బండప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి తాగునీరు ఏమాత్రం అందటం లేదు. దీంతో వారు తాగునీటి కోసం గ్రామంలోని శివాలయం, అల్లంత దూరంలో ఉన్న మినీ నీటిట్యాంకుల దగ్గరకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. యల్లమ్మ బండ ప్రాంతవాసులకు తాగునీరు అందించాలని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఐదు బోర్లు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. బోర్లు ఏర్పాటు చేసిన వెంటనే దానికి మోటార్లు బిగించి నీటని మళ్లించేందుకు పైప్‌లైన్ వేయాల్సిన అధికారులు పట్టించుకోక పోవటంతో బోర్లు కాస్త దిష్టిబొమ్మల్లా మారాయి. గ్రామసమీపంలో ఓ బోరు ఉన్నా అందులోని నీరు తాగేందుకు పనికిరాకపోవటంతో వాటిని స్థానికులు వాడుకునేందుకు వినియోగించుకుంటున్నారు. అంతేగాక గతంలో యల్లమ్మ బండప్రాంతానికి తాగునీటి సరఫరా కోసం స్థానికులు సొంతంగా డబ్బు వెచ్చించి పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నా నిర్వహణ లేకపోవటంతో అదికాస్త ధ్వంసమైంది. దీంతో నీరు రావటం లేదు. అలాగే గంజహళ్లి రోడ్డులో జలజీవన్ మిషన్ కింద రూ. లక్షలు వెచ్చించి ఆరు నెలల క్రితం రెండు బోర్లు వేశారు. వాటికి మోటార్లు బిగించలేదు. దీంతో అవి కాస్త వృథాగా మారి పోయాయి. ఇటీవల గ్రామం లోని ప్రధాన రహదారిలో ఎంపీ నిధులు రూ. 1.15లక్షలతో బోరు వేశారు. దానికి పైప్‌లైన్లు వేయకుండా అలాగే వదిలేశారు. ఇక సంతనాగలాపురం ఎస్ఎస్ ట్యాంకు నుంచి వచ్చే నీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి, ఇటీవల ఆదే ఎస్ఎస్ ట్యాంకు నుంచి గ్రామానికి నేరుగా పైప్‌లైన్ వేసినా ఆశించిన స్థాయిలో నీరు అందటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరా ఉంటేనే నీరు సరఫరా అవుతోంది. గ్రామప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.



గంజహళ్లి రహదారిలో ఏర్పాటు చేసిన చేతిపంపు



గ్రామానికి నీటిని అందించేందుకు వేసిన బోరు

మా ప్రాంతానికి తాగునీరు రావటం లేదు



మా గ్రామంలోని యల్లమ్మబండ ప్రాంతంలో నివసిస్తున్నాం. తాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాంతానికి తాగునీరు సరఫరా లేదు. నీటికోసం శివాలయం ప్రాంతానికి తోపుడు బండ్లను తీసుకెల్లి తెచ్చుకోవాలి. మా వీధిలో నటి సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నా నీరు రావటం లేదు. గ్రామ సమీపంలో బోర్లు వేసి వదిలేశారు. అధికారులు మాకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- తోట లక్ష్మి, కడివెళ్ల, ఎమ్మిగనూరు మండలం

రెండు చోట్ల బోర్లు ఏర్పాటు చేశాం



గ్రామశివారులో ఒక చోట, ప్రధాన రహదారిలో మరో చోట బోర్లు ఏర్పాటు చేశాం.అయితే గంజళ్లరోడ్డులో ఏర్పాటు చేసిన బోరులో నీటి ఊట అంతంత మాత్రంగా ఉండటంతో మోటరు ఏర్పాటు చేయలేదు. మరో బోరులో రెండు ఇంచుల నీరు పడ్డాయి. అక్కడ మోటారు, పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిసరఫరా చేస్తాం.

ప్రేమ్ కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎమ్మిగనూరు

'కించపరిచేలా మాట్లాడటం జేసీకి తగదు'

ఎమ్మిగనూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జేసీ ప్రభాకర్‌రెడ్డి వాల్మీకి సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. ఇది అధికార పార్టీకి వాల్మీకి వర్గంపై గౌరవం లేదన్న సంకేతంగా ప్రజలు భావిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జేసీ ప్రభాకర్‌రెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఖాజా, రంగ పాల్గొన్నారు.

వరుస చోరీలు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు రెండు రోజుల క్రితం శివన్న నగర్, గాంధీ నగర్‌లో వరుస చోరీలతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. వాటి నుంచి తేరుకోక ముందే పట్టణంలోని న్యూ ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న జ్ఞానేశ్వర్‌రెడ్డి (రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి) ఇంట్లో ఆదివారం దొంగతనం జరిగింది. న్యూ ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న జ్ఞానేశ్వర్‌రెడ్డి ఆదివారం ఉదయం 8గంటలకు ఇంటికి తాళం వేసి ఆర్‌సీఎం చర్చికి వెళ్లారు. చర్చి నుంచి వచ్చి చూస్తే తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ. 150000 విలువైన 4 బంగారం గాజులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసి పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు కమశేష్ గణేశ్, దేవాదానం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రజా రవాణా అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎద్దుల మార్కెట్ వెళ్ళే రోడ్డు, గాంధీనగర్‌లోని రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉందని అన్నారు. అలాగే షరాఫ్ బజార్ నుంచి ఎంబి చర్చ్‌కు వెళ్ళే దారిలో ఇరువైపుల రోడ్డుకు కంకర వేసి నెలలు కావస్తున్న పనులు పూర్తి కాలేదన్నారు, అసెంబ్లి చర్చి, సోగనూర్ రోడ్డు కాలనీ, బాబు జగ్జీవరామ్ కాలనీలలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, పట్టణంలో వీధి పశువులు రోడ్డుకు అడ్డంగా ఉండడం వలన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వీధి పశువులను గోశాలలకు తరలించాలని కొరారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దీలిప్, గిడ్డయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మంత్రాలయం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం బస్టాండు సమీపంలో సరదాగా తోపులాటలో కింద పడి స్నేహితుడు మృతి చెందిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎస్ఐలు రామాంజులు, శివాంజల్ తెలిపారు. ఈ నెల 17న కర్ణాటకలోని రాయచూరు జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన బోయ దుల్లయ్య (36) సరదాగా ఆయన ప్రైవేటు భాగాలపై తన్నడంతో కింద పడి తోటి స్నేహితుడు మృతి చెందడం జరిగింది. దీంతో స్నేహితునిపై పోలీసులు హత్య కేసు నమోదు చేయడం పాఠకులకు విధితమే. సోమవారం మాధవరం సమీపంలోని సూగూరు క్రాస్ వద్ద రామకృష్ణను విచారించి నిజం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు. రామకృష్ణను ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉపాధి కల్పించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు గ్రాట్యూటి పెన్షన్‌తో పాటు మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు.. అనంతరం సమ్మె శిబిరం నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి ఎమ్మార్వో శేషాఫణికి డిమాండ్‌ల పత్రం అందజేశారు. ఈ కార్యకరమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శి గోవిందు, రాముడు, మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, నాగరాజు, ఖాజా,అబ్దుల్లా పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

కోసిగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, కామన్‌దొడ్డి, ఆర్లబండ తదితర గ్రామాల ప్రజలకు 70 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ ఎక్స్‌రే పరీక్షలు చేయడం జరిగిందని వైద్యాధికారి సి.రజిత తెలిపారు. సోమవారం కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కందుకూరు, కామన్‌దొడ్డి గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్ధారణ ఎక్స్‌రే పరీక్షలు ప్రభుత్వం ఉచితంగా చేయిస్తుందని, ప్రతి ఒక్కరూ క్షయపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు, క్షయ సూపర్‌వైజర్ స్వరూప, భాస్కర్, ఎంఎల్‌హెచ్‌పీ గీత, పూర్ణిమ, ఏఎన్ఎం నాగలక్ష్మి, 104 సిబ్బంది విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీమ ముద్దు బిడ్డ కాదు.. క్యాన్సర్ గడ్డ

- మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే బీవీ ధ్వజం



పూలచింతలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నందవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి: రాయల సీమకు అన్ని రకాలుగా ద్రోహం చేసిన జగన్ రాయల సీమ ముద్దుబిడ్డ కాదు క్యాన్సర్ గడ్డ అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నందవరంలో ఆయన మాట్లాడారు. రాయల సీమ ప్రజలను మోసం చేసి , ఇబ్బందులకు గురి చేసి రాయల సీమ నీటి వాటాను, నిధులను, నియమకాలను కొల్లగొట్టి వ్యక్తి జగన్ రాయల సీమ ముద్దు బిడ్డ కాదు క్యాన్సర్ గడ్డేనని ఎద్దేవ చేశారు. ఎమ్మిగనూరులో అబివృద్ధి అంటేనే బీవీ అని... బీవీ అంటేనే అభివృద్ధి అనేది ఇక్కడ ప్రజలందరి తెలుసన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదవరావు, ఈరన్నగౌడు, కాశీంవలీ, దర్మాపురం గోపాల్, నారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లచ్చప్ప పాల్గొన్నారు.

నందవరంలో ఎమ్మెల్యే పర్యటన: నందవరంలో తిమ్మారెడ్డి కుంట దగ్గర తాగునీటిని విడుదల చేసి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి జలహరతి చేపట్టారు. అలాగే నందవరం టీడీపీ నాయకులు వడ్డేమురళి కుమారుడు విద్యార్థి సిద్దార్థ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంగవరం దగ్గర గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు జలహరతి చేసి ఎత్తి పోతల పథకం కింద రైతులకు సాగునీరు విడుదల చేశారు. అలాగే మండలంలోని పూలచింత గ్రామంలో సర్పంచ్ అక్కామాంబ బండేగురుస్వామి ఆధ్వర్యంలో సుపరిపాలనతోనే స్వచ్ఛంద్ర ప్రదేశ్ అని ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందజేసిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీంవలీ, బండేగురుస్వామి, ముగతి ఈరన్నగౌడు, దర్మాపురం గోపాల్, రైస్‌మిల్ నారాయణరెడ్డి, డబ్బా ఈరన్న, గడ్డంబజారి, షరీఫ్, బంగారి, గడంగం నరసింహులు, నదిక్రైరవాడి వీరేష్, సత్యారెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దృష్టికి రాళ్లదొడ్డి సమస్యలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లదొడ్డి గ్రామంలో నెలకొన్న సమస్యలను టీడీపీ నాయకుడు మురళికృష్ణారెడ్డి సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా గ్రామంలోని ప్రజలు రేషన్ బియ్యం తీసుకునేందుకు పక్కగ్రామమైన ఎర్రకోట గ్రామానికి రావాల్సి వస్తుందన్నారు. దీంతో ఎంతో మంది పేదలకు సకాలంలో రేషన్ బియ్యం అందడంలేదన్నారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, ప్రతి ఇంటికి కుళాయిని ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'సమయపాలన పాటించాలి'

కోసిగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్యోగులందరూ సమయ పాలన పాటించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి అన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి మాట్లాడుతూ మండలానికి కొత్తగా వచ్చిన ఉద్యోగులు సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే మండలంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఆగస్టు నెలలో కొత్త డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ అవుతాయనీ ఎంఈవో మోయినుద్దీన్ తెలిపారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుని సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించాలని డెమో పైపు ద్వారా పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు వివరించారు. యూరియా అధిక మోతాదులో వాడి భూసారాన్ని తగ్గించుకోవద్దని, యూరియాను ఎంత తక్కువ వాడితే రైతులకు అంతు మేలు జరుగుతుందని, ప్రస్తుతం యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలు ఇస్తున్న యువనాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డి

మంత్రాలయం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా యువనాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డి అన్నారు. సోమవారం మంత్రాలయం రాఘవేంద్ర పురంలో సుపరిపాలన తొలి అడుగు లో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలు మేరకు ఇంటింటకి తిరిగి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య, టీడీపీ నాయకులు ఎస్ఎం గోపాల్ రెడ్డి, రాజన్న, రాఘవేంద్ర, నాగరాజు, ఎంపీటీసీ మేకల వెంకటేష్, చిదానంద పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలక వర్గ ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్యే అధ్యక్షతన
ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మాపురం గోపాల్

నందవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): నందవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మండల పాలక వర్గం సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారుల అధ్వర్యంలో అధ్యక్షుడుగా ధర్మాపురం గోపాల్, సభ్యులుగా మహేష్, బీమశేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడుగా ప్రమాణం చేసిన దర్మాపురం గోపాల్ మాట్లాడుతూ మండల రైతులకు అందుబాటులో ఉండి, అన్ని రకాల రుణాలతో పాటు, ఎరువులు సకాలంలో అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి వమ్ము చేయకుండా ఆ పదవికి వన్నె తెస్తానన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో పాటు మండల నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని వారందరికి అబినందనలు తెలిపారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు, మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ నమ్మిన బంటుగా ఉండి, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తికి సముచిత స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, దేశాయి మాదవరావు, పుష్పావతి,మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు, కాశీంవలీ, నాగరాజుగౌడు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పూలచింత బండేగురుస్వామి, కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, నాగలదిన్నె రంగయ్యశెట్టి, గజేంద్రరెడ్డి, ఎన్ఏ వాహబ్, డివి రాముడు, బార్గవ్‌యాదవ్, జగ్గాపురం నరసింహులు, తిమ్మప్ప, గోపాల్, సత్యారెడ్డి, లచ్చప్ప, ముగతి కడుబూరి, వీరేష్, ఆదిశేషు, సలీం, మల్లి, తెలుగు ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, తురేగల్ నజీర్, డబ్బా ఈరన్న, దావీదు, మాచపురం వలీ పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కల్పించాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినిలందరికి సీటు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబిర్ బాషా కోరారు. సోమవారం కర్నూలులోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఎక్కడో ఓ చోట ప్రైవేటు బిల్డింగ్‌ను అద్దెకు తీసుకొని అయినా విద్యార్థినులకు వసతి గృహాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలి

పెద్దకడుబూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని కురువ వీధిలో సర్వేనెంబర్ 258లో 14 సెంట్ల ఓపెన్ స్థలంలో విధించిన సీఆర్‌పీ 145 సెక్షన్‌ను ఎత్తివేసి ఆ స్థలంలో కురువ కమ్యూనిటి హాల్ నిర్మాణానికి సహకరించాలని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, కురువ సంఘం నాయకులు మల్లికార్జున, కేజీ నరసింహులు, కేటీ శివన్నలు కోరారు. సోమవారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో కురువ వీరనాగప్ప, విరుపాక్షి, మల్లికార్జున, సిద్దప్ప, లక్ష్మన్న, నాగేంద్రలు పాల్గొన్నారు.

చింతకుంట పాఠశాల తనిఖీ



చింతకుంటలో విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఐదు తరగతులకు ఒకే టీచర్.. చింతకుంట ప్రాథమిక పాఠశాలలో దుస్తితి.. 329 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం మాత్రమే అను ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించి ఇద్దరు అదనపు టీచర్లను కేటాయించామని ఎంఈవో మోయినిద్దీన్ తెలిపారు. అలాగే సోమవారం చింతకుంట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి ప్రధానోపాధ్యాయురాలు గంగమ్మను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి పాఠశాలలోని విద్యార్థులతో పుస్తకాలు చదివించి ఏం నేర్చుకుంటున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టులో కొత్త డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులన్నీ భర్తీ అవుతాయనీ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో పాఠశాలను తనిఖీ చేసి ఇద్దరు అదనపు ఉపాధ్యాయులను నియమించామని ఎంఈవో తెలిపారు.